J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 21.02.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ● బీజేపీ - వైసిపి

# జాయింట్ ఆపరేషన్





- బాబు పరేషాన్
- చంద్రబాబు చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- కాంగ్రెస్‌కు ఆర్థిక సాయం అందించాడనే కోణంలోనే విచారణ
- అహ్మద్‌పటేల్‌ను రాజ్యసభకు పంపడంలోనూ బాబు పాత్ర

***ఆయన అధికారంలో వుండగా ఎగిరెగిరి పడ్డాడు.. ప్రధానిగా వున్న నరేంద్ర మోడీని అనరాని మాటలన్నాడు. ఆయన కుటుంబాన్ని విమర్శించాడు. అంతేనా... రాష్ట్రంలో అప్పుడు ప్రతిపక్ష నేతగా వున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డిని నోటికొచ్చినట్లు తిట్టాడు. ఏ కోర్టు కూడా ఆయనను దోషిగా తేల్చకుండానే ఈయన పాటికి ఈయన జగన్‌ను లక్షకోట్లు తిన్నాడని, జైలుకు పోతాడని నోటికొచ్చినట్లు వాగాడు. ఆయన తిట్టడమే కాదు, తన అనుచరులచేత కూడా కనీస మర్యాద లేకుండా మాట్లాడించాడు. గురివింద గింజ తన నలుపెరుగదన్నట్లుగా పేట్రేగి పోయాడు. అలా ఎగిరెగిరిపడ్డ ఆ నాయకుడెవరో కాదు మన చంద్రబాబునాయుడే!***


ఇప్పుడు కాలం తిరగబడింది. చంద్రబాబు అక్రమాల పుట్టలను ప్రొక్లెయిన్‌లతో మరీ తవ్వుతున్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు చంద్రబాబుపై అక్రమాలను తవ్వితీసే పనిలో జాయింట్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. ఈ ఆపరేషన్ సక్సెస్ అయితే చంద్రబాబు తన జీవితంలో వూహించని చీకటిరోజులను చవిచూడాల్సి వుంటుంది.

ఇటీవల కాలంలో చంద్రబాబు పి.ఏ శ్రీనివాస్‌తో పాటు మరికొందరు అనుయాయుల ఇళ్లపై ఐ.టి దాడులు జరగడం తెలిసిందే! ఈ దాడుల్లో నగదు పెద్దగా దొరకపోయినా గత 5ఏళ్ల చంద్రబాబు పాలనలో చోటుచేసుకున్న ఎన్నో అక్రమాలు బయటపడ్డట్లు తెలుస్తోంది. డొల్ల కంపెనీల పేరుతో కాంట్రాక్ట్‌లు ఇవ్వడం, వాటికి అర్హత లేకున్నా వందలకోట్లు నగదు బిల్లుల రూపంలో చెల్లించడం వంటి లొసుగులు భారీగానే వున్నట్లు తెలుస్తోంది. ఇలా అడ్డదారిన నొక్కేసిన డబ్బుతోనే చంద్రబాబు లోక్‌సభ ఎన్నికలకు ముందు పలు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సహకరించాడన్న సమాచారం కేంద్రం వద్ద వుంది.

### ఓవర్‌యాక్షనే బాబు కొంప ముంచింది

నోట్ల రద్దు, తదుపరి పరిణామాల తర్వాత చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీపై రెచ్చిపోయాడు. నోట్ల రద్దును మొదట్లో సమర్థించిన ఆయన, ఈ వ్యవహారంలో ప్రజల్లో మోడీపై వ్యతిరేకత వచ్చిందనగానే 'యూ'టర్న్ తీసుకున్నాడు. నోట్ల రద్దును తుగ్లక్ చర్య అన్నాడు, అంతే కాదు, మోడీపై వ్యతిరేకత వల్ల తాను రాజకీయంగా నష్టపోతానని, అతని ప్రభావం తమపై పడుతుందని వూహించేసుకున్నాడు. ఇంకేముంది... మోడీ ఎంత, అతని అధికారమెంత? అసలు నాముందు మోడీ ఎంత... అనే పాటందుకున్నాడు. ప్రధాని హోదాలో మోడీ గుంటూరుకు వస్తుంటే... గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి 'గో బ్యాక్ మోడీ' అంటూ పెద్దపెద్ద హోర్డింగ్‌లు పెట్టించాడు.

ఇక బీజేపీకి దూరమై కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలతో (మిగతా 11వ పేజీలో)




## రాజ్యసభకు బీద?



- జిల్లా నుండి మూడో ఛాన్స్

నెల్లూరుజిల్లా నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలు రాజ్యసభ సభ్యులుగా వున్నారు. వైసిపికి రాజ్యసభలో (మిగతా 11వ పేజీలో)

## ఎన్డీఏలో చేరిక

# ఏపికి వేడుక

- రాజకీయ ప్రయోజనాల దృష్టితో కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ ఆలోచిస్తే ఎన్డీఏలో చేరడం ఖాయమే!
- ప్రత్యేకహోదా ఇవ్వకున్నా, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక రాయితీలు ప్రకటించే అవకాశం

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగాలేదు. రాష్ట్ర విభజన వల్ల ఏపి తీవ్రంగా నష్టపోతే, గత ఐదేళ్ల చంద్రబాబు పాలన రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముందు తలకు మించిన భారం ఉంది. ఓపక్క అప్పులు, వడ్డీలు.. ఇంకో పక్క భారీ ఎత్తున పెట్టుకున్న సంక్షేమ పథకాలు... దీనికితోడు అభివృద్ధి పనులను కొనసాగించాలి. ఇవన్నీ చేయాలంటే లక్షల కోట్ల నిధులు కావాలి. రాష్ట్ర ప్రభుత్వమే (మిగతా 11వ పేజీలో)





# బిట్రగుంట స్టేషన్‌కు కొత్త రూపం

రైల్వేపరంగా బిట్రగుంట స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, ఇక్కడ రైల్వేకు సంబంధించిన పరిశ్రమను నెలకొల్పాలని ఎప్పటి నుండో డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో పనబాక లక్ష్మి నెల్లూరు ఎంపీగా వున్నప్పుడు ఇక్కడ రైల్వే కాంక్రీట్ స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు కూడా! అయితే అది శిలాఫలకానికే పరిమితమైంది.

ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఎంపీ అయినప్పటి నుండి గత 8 నెలగా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం బాగానే కష్టపడుతున్నాడు. దీని గురించి పార్లమెంటులో ప్రస్తావించాడు. రైల్వే మంత్రులతో మాట్లాడాడు. బిట్రగుంటకు ఒక్క రైల్వే ప్రాజెక్ట్‌నైనా తేవాలన్నది ఆదాల పోరాటం. అయితే ఇప్పటికైతే రైల్వే పరిశ్రమ వూసులేదుగాని, బిట్రగుంట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. బ్రిటీషోళ్ల టైంలో రైల్వే పరంగా బిట్రగుంట ఒక వెలుగు వెలిగిందనేదానికి గుర్తుగా ఈ రైల్వేస్టేషన్ మిగిలి వుండేది. బ్రిటీష్‌వాళ్ళ టైంలో కట్టిన భవనాలు, ప్లాట్‌ఫాంలే వుండేవి.

ఎట్టకేలకు బిట్రగుంట స్టేషన్ ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. ప్లాట్‌ఫాంల ఆధునీకరణ, ఇండికేటర్స్, టిక్కెట్ బుకింగ్ కౌంటర్, వెయిటింగ్‌హాల్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, వాహనాల పార్కింగ్ వసతి... ఇలా స్టేషన్‌ను ఎంతో అందంగా మారుస్తున్నారు.

# అక్రమ రవాణాకు అడ్డుకట్ట

**- జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్**



క్రైంమీటింగ్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్

ఎర్రచందనం, మైనింగ్, ఇసుక, గంజాయి తదితరాల అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ హెచ్చరించారు. ఈనెల 19న నెల్లూరు ఎస్పీ కార్యాలయంలో గూడూరు డివిజన్ క్రైం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలను కూడళ్ళలో, బ్లాక్ స్పాట్ లలో ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈవ్‌టీజింగ్‌ను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బెల్టుషాపులు, నాటుసారా విక్రయకేంద్రాలు గుర్తించి, వాటిని పూర్తిగా కట్టడి చేయాలని, ఇసుక ఎర్రచందనం, గుట్కా అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని, వైట్‌కాలర్ నేరాల్లో లోతుగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. ఎండాకాలం వస్తున్న దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశముందని, వీటి నియంత్రణకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా వుంచాలని ఆదేశించారు. వాహన తనిఖీలను ఎప్పటికప్పుడు ముమ్మరం చేసి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో ట్రాఫిక్‌పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పాత కేసులు దర్యాప్తు పూర్తి చేసి కేసులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గూడూరు డీఎస్పీ భవాని హర్ష, డీసీఆర్‌బి గూడూరు నగర, రూరల్, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వాకాడు ఎస్సైలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎస్సైలకు బదిలీలు

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఈనెల18న ఉత్తర్వులు జారీచేశారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ ఎస్సై బలరామయ్యను అల్లూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎం.రఘునాథ్‌ను జిల్లా వీఆర్‌కు పంపారు. నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఎస్సై కె.తిరుపతయ్యను బాలాజీ నగర్ పోలీస్‌స్టేషన్‌కు అక్కడ పనిచేస్తున్న కె.వీరప్రతాప్‌ను కొడవలూరు పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేశారు. సంతపేట ఎస్సై పి.వీరనారాయణను మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌కు, వీఆర్‌లో వున్న టి.వెంకటరమణను సంతపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నెల్లూరు సీసీయస్‌లో పనిచేస్తున్న బి.శివప్రకాష్‌ను నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, ఎస్సైలు కె.మరిడినాయుడు, కె.కొండపనాయుడును జిల్లా వీఆర్‌కు పంపారు. బదిలీ అయినవారు వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# నెల్లూరీయుడికి ప్రధాని అభినందన

నెల్లూరుజిల్లా ఉదయగిరి వాసి షేక్ జాకీర్‌హుస్సేన్‌కు అరుదైన ప్రశంసలు దక్కాయి. న్యూఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద 'హ్యాట్' సంస్థ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రధాని నరేంద్ర మోడీ 19వ తేదీ సందర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌లో జాకీర్‌హుస్సేన్ చెక్క వస్తువుల స్టాల్‌ను ఏర్పాటు చేశాడు. ఈ స్టాల్‌లోని చెక్కవస్తువులు ప్రధానిని విపరీతంగా ఆకర్షించాయి. ఆ స్టాల్ వద్ద ఆయన కొద్దిసేపు ఆగి, ఆ వస్తువులు ఎలా తయారు చేస్తారు, ఒక్కో వస్తువు తయారీకి ఎంత సమయం పడుతుంది, ఈ పని మీద ఎంతమంది జీవనాధారం సాగిస్తున్నారన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వస్తువులు చూడచక్కగా వున్నాయని, వాడుకోవడానికి ఇంకా బాగుంటాయని ప్రధాని అభినందించారు.

# అవినీతి బాణం అరెస్ట్



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో అమాయకులను నమ్మించి లక్షలు వసూలు చేసి బురిడీ కొట్టించాడు ఓ ప్రబుద్ధుడు. బెస్ట్ ఔట్‌సోర్సింగ్ ఏజన్సీ ద్వారా తాత్కాలిక ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతాలను లక్షల్లో స్వాహా చేశాడు. అటు నిరుద్యోగులను ఇటు చిరుద్యోగులను మోసం చేసిన బాణాల శ్రీనివాసులు అనే బెస్ట్ చీటర్‌ను ఇప్పుడు నెల్లూరు దర్గామిట్ట పోలీసుస్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఒకప్పుడు జాయింట్ కలెక్టర్ సిసిగా వుండి అవినీతి ఆరోపణలతో ఉద్యోగం పోగొట్టుకున్న బాణాల శ్రీనివాసులు అనే ఘనుడు బెస్ట్ ఔట్‌సోర్సింగ్ ఏజన్సీని స్థాపించి, తన పలుకుబడితో ప్రభుత్వ శాఖల్లో తన ఏజన్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాడు. మున్సిపాల్టీ, నుడా, ఐటిడిఏ, సోషల్ వెల్ఫేర్ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించాడు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు రావడంతో గత కలెక్టర్ ముత్యాలరాజు ఆయన 'బెస్ట్' ఔట్‌సోర్సింగ్ ఏజన్సీని బ్లాక్ లిస్టులో పెట్టించాడు. ముత్యాలరాజు బదిలీ అయిపోయాక తన పలుకుబడితో మళ్ళీ బ్లాక్‌లిస్టులో నుండి ఏజన్సీని తొలగించి, మళ్ళీ ఉద్యోగ నియామకాలు చేపట్టాడు. సోషల్ వెల్ఫేర్ ఔట్‌సోర్సింగ్‌లో 22లక్షల వేతనాలు స్వాహా చేశాడు. అంతేకాదు, పలు ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలిప్పిస్తాని, అవి తర్వాత కాలంలో పర్మినెంట్ అవుతాయని, ప్రభుత్వోద్యోగులుగా గుర్తింపు వస్తుందని ఎంతో మందిని నమ్మించి మోసం చేసి లక్షల రూపాయలు దండుకున్నాడు. వేతనాలు స్వాహా చేసినందుకు సోషల్ వెల్ఫేర్ డి.డి ఇచ్చిన ఫిర్యాదుతో పాటూ పలువురు మోసపోయిన బాధితులు కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆయనను వెదికి పట్టుకున్నారు.

## గూడూరు వాసికి
# ప్రతిష్టాత్మక పదవి



గూడూరు పట్టణానికి చెందిన శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, మాజీ గుంతకల్ రైల్వే డివిజన్ డీఆర్‌యుసిసి మెంబరైన బి.శ్యామ్ సుందర్‌రావు(మయూరి శ్యామ్)ను అంతర్జాతీయ మానవహక్కులు, నేర వ్యతిరేక సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు టి.కృష్ణప్రసాద్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడిగా అలాగే డీఆర్‌యుసిసి మెంబర్‌గా శ్యాం యాదవ్ ప్రజలకు ఎన్నో సేవలందించారు. గూడూరు పట్టణంలో జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ ఆయన ముందుంటూ ప్రజలకు తలలో నాలుకలా ఉంటున్నారు. ఆయనకు ఈ పదవి రావడం పట్ల అభిమానులు, అనుచరులు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభినందనలు తెలియజేస్తున్నారు.

# ఎస్ఎస్ లింక్ కెనాల్‌తో వెంకటగిరికి మహర్దశ

**- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**



సచివాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌ను పూర్తి చేసి వెంకటగిరి నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఈనెల 19 న రాపూరు సమీపంలోని మద్దెలమడుగులో సచివాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ విద్య, తాగు, సాగు నీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దివంగత సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు రూ.400కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారని తెలిపారు. వైయస్సార్ మరణానంతరం అటవీశాఖ అనుమతులకు నోచుకోక పలుచోట్ల కాలువ పనులు నిలిచిపోయాయన్నారు. ఎస్ఎస్ కెనాల్ పూర్తయితే రాపూరు, డక్కిలి, వెంకటగిరి ప్రాంతాలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని, ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళి అటవీ అనుమతులు సంపాదించి కెనాల్‌ను పూర్తి చేయిస్తామన్నారు. కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ చెన్ను బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర రైతు సంఘం కార్య దర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, సొసైటి అధ్యక్షుడు చెన్ను భాస్కరరెడ్డి, తహశీల్దార్ శాంతకుమారి, ఎంపీడీఓ అమోస్ బాబా, డీఈలు విజయకుమార్, మోహన్ రావు, ఎంఈఓ శ్రీనివాసులు, దయాకర్ రెడ్డి, బాలగోపాల్‌రెడ్డి, మధురెడ్డి, తిరుపాల్ రెడ్డి, నరశింహారెడ్డి పాల్గొన్నారు.

# 'స్థానిక'ంలో బీజేపీ విజయానికి కృషి చేయాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ విజయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ జాతీయ మహిళా మోర్చా ఇన్‌చార్జి దగ్గుబాటి పురందరేశ్వరి పిలుపునిచ్చారు. ఈనెల 18న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అధ్యక్షతన నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని ఓ కల్యాణ మండపంలో నెల్లూరు జోనల్ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో పోటీ చేయించి ఎక్కువ స్థానాలు గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, జిల్లా ఇన్‌ఛార్జి సైదారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, నాయకులు సామంచి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, ఖయామత్ ఆలీ, కాకు విజయలక్ష్మీ, మిడతల రమేష్, సురేంద్రరెడ్డి, కందుకూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉన్నతాధికారుల సంక్షేమ సంఘం



జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులందరూ ఒక కార్యవర్గంగా ఏర్పడ్డారు. ఈ కార్యవర్గానికి గౌరవాధ్యక్షులుగా జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, గౌరవ అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్, అదనపు జాయింట్ కలెక్టర్ కమలకుమారి, అధ్యక్షులుగా డిఆర్‌ఓ మల్లిఖార్జున, అసోసియేట్ అధ్యక్షులుగా నుడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డి, జడ్పీ సి.ఇ.ఓ పి.సుశీల, ఉపాధ్యక్షులుగా నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్ బాషా, నెల్లూరు కమిషనర్ పి.వి.ఎస్.ఎస్.మూర్తి, సెట్నల్ సి.ఇ.ఓ సుస్మితారెడ్డి, కార్యదర్శిగా డిఆర్‌డిఏ పి.డి వి.కె.శీనానాయక్, జాయింట్ కార్యదర్శులుగా ఐసిడిఎస్ పి.డి సుధాభారతి, కె.ఆర్.ఆర్.సి డిప్యూటి కలెక్టర్ ఎం.దాస్, ఐటిడిఏ పి.ఓ రమేష్, కోశాధికారిగా సర్వశిక్షా అభియాన్ పి.ఓ బ్రహ్మానందరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను, అలాగే అసిస్టెంట్ సెక్రటరీ కల్చర్‌గా జిల్లా పర్యాటక అధికారి ఎస్.శ్రీనివాసులును, స్పోర్ట్స్ అసిస్టెంట్ సెక్రటరీగా డి.ఇ.ఓ జనార్దనాచార్యులను, ఉమెన్ వెల్ఫేర్ అసిస్టెంట్ సెక్రటరీగా బిసి సంక్షేమ అధికారి రాజేశ్వరిని ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులంతా కూడా 20వ తేదీ జిల్లా కలెక్టర్ యం.వి.శేషగిరిబాబును ఆయన ఛాంబర్‌లో కలిసి సత్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలుకు అసోసియేషన్ తరపున తమవంతు సహాయసహకారాలు అందిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు మల్లిఖార్జున తెలిపారు.

### కొత్తూరు సాయిబాబా, యోగాంజనేయస్వామి మందిరాలలో...

# అలరిస్తున్న సుందరకాండ సప్తాహం





నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ షిరిడి సాయి బాబా, శ్రీ యోగాంజనేయస్వామి మందిర ప్రాంగణంలో స్వర్గీయ సుందరదాసు ఎంయస్ రామారావు స్వరపరిచి గానం చేసిన సుందరకాండను ఆయన మనుమడు, హనుమదుపాసకులు, పూజ్య గురువులు డాక్టర్ పి.శ్రీనివాస్ స్వామీజీ ఈనెల 16 నుండి ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు సుందరకాండ సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. 22వతేదీ దాకా ఈ సప్తాహం జరుగనుంది. కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహం, శ్రీ యోగాంజనేయస్వామి విగ్రహం భారతదేశానికే తలమానికమని, హైందవ సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలిచిన ఈ ఆలయాలను నిర్మించిన కలికి కోదండరామిరెడ్డి అభినందనీయుడని శ్రీనివాస్ స్వామీజీ ప్రశంసిం చారు. కాగా, 21వతేది మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగను న్నాయి. వేకువఝామున 1 గంట నుండి 5 గంటల వరకు శివపార్వతి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. 23వతేది ఆదివారం ఉదయం 11గంటలకు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

ఈనెల23 వరకు జరిగే మహోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని , కల్యాణోత్సవాలను తిలకించి తీర్థ ప్రసాదాలను, అన్న సంతర్పణను స్వీకరించాలని నిర్వాహకులు కలికి కోదండరామిరెడ్డి కోరుతున్నారు.

### నెల్లూరు సి.ఏ ఇన్‌స్టిట్యూట్‌కు

# అరుదైన గౌరవం



చిన్ని శ్రావణ్‌కుమార్

నెల్లూరు వెంకటాచలంలోని సి.ఏ ఇన్‌స్టిట్యూట్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇందులో భాగమైన సౌత్‌ఇండియా సి.ఏ స్టూడెంట్స్ అసోసియేషన్ చేసిన సేవలకు గాను సౌత్‌ఇండియా లోనే నెల్లూరు సి.ఏ ఇన్‌స్టిట్యూట్ ద్వితీయ స్థానం గెలుచుకుంది. 2010లో ఈ సి.ఏ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించగా, ఈ పదేళ్ళలో తొలిసారిగా ఆ గౌరవం దక్కడం విశేషం.

సౌత్ ఇండియా సి.ఏ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న చిన్ని శ్రావణ్‌కుమార్ కృషితోనే ఈ స్థానం దక్కిందని, ఇది నెల్లూరు సి.ఏ బ్రాంచ్‌కే గర్వకారణమని పలువురు ఆడిటర్లు, సి.ఏ స్టూడెంట్లు ఆయనను అభినందించారు. త్వరలో సౌత్‌ఇండియా స్థాయిలో జరిగే ఉత్సవాల్లో చిన్ని శ్రావణ్ కుమార్‌ను సత్కరించనున్నారు.

# ఆపండి...

## నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియపై హైకోర్టు స్టే



నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియపై ఏ.పి హైకోర్టు స్టే విధించింది. తమ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి ఎన్నికల ఏర్పాట్లు చేయొద్దంటూ 19వ తేదీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో నగరపాలక సంస్థ ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది.

నెల్లూరు కార్పొరేషన్ డివిజన్‌ల విభజనలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, డివిజన్‌ల రిజర్వేషన్‌లపై సర్వే నిర్వహించ కుండానే ప్రతిపాదనలు పంపారని, డివిజన్‌ల వారీగా ఓట్లలో భారీ తేడాలున్నాయని, పొట్టేపాలెం గ్రామం లేకుండా రూపొం దించిన మున్సిపల్ కార్పొరేషన్ మ్యాప్‌పై ఇతరుల అభిప్రాయాలు తీసుకోలేదని పేర్కొంటూ తెలుగుదేశంపార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ ఈనెల 10వతేదీన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలను అనుసరించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశాకే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు ఎన్నికలపై స్టే ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. 19వ తేదీ ఆయన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న హైకోర్టు స్టేపై నిర్ణయం తీసుకోనుంది. స్టే ఎత్తేస్తే ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టొచ్చు.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఇంతవరకేమీ షెడ్యూల్ విడుదల కాలేదు. కాకపోతే మార్చి 15వ తేదీలోపు మాత్రం అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేయాలని మంత్రి మండలి తీర్మానించడం తెలిసిందే! స్థానిక సంస్థల్లో బి.సి రిజర్వేషన్‌ల అంశంపై హైకోర్టు తీర్పు రిజర్వ్‌లో వుంది. ఈ నెలలోనే దానిపై తీర్పు వస్తే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను మొదలుపెట్టి అంతా కూడా రెండు వారాలలో ముగించవచ్చు. అలా ప్రకటించ కుండా ఈ అంశాన్ని హైకోర్టు గాని నానిస్తే ఇక 2నెలల దాకా స్థానికసంస్థల ఎన్నికల గురించి ఆలోచించాల్సిన అవసరమేలేదు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

## - కృష్ణచైతన్య కళాశాల వార్షికోత్సవాల్లో మంత్రి అనిల్



జ్యోతి ప్రజ్వలనతో వార్షిక సంబరాలను ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్లు, మంత్రి అనిల్‌కుమార్

విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 17న నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని అనిల్ గార్డెన్స్‌లో కృష్ణచైతన్య జూనియర్ కళాశాల వార్షిక సంబరాల కార్యక్ర మానికి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. అనంతరం మంత్రి అనిల్‌ను కళాశాల యాజమాన్యం సత్క రించారు. జేఈఈ మెయిన్స్ -2020 జాతీయ స్థాయిలో ప్రతిభ కనుపరచిన 16 మంది విద్యార్థులకు పతకాలు, స్పోర్ట్స్ మీట్ విజేతలకు షీల్డులు బహుకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కళాశాల డీన్ శిరీష్, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలు

## - విఎస్‌యు రిజిస్ట్రార్ అందె ప్రసాద్



సత్కారాన్నందుకుంటున్న విఎస్‌యు రిజిస్ట్రార్ అందె ప్రసాద్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు నని విఎస్‌యు రిజిస్ట్రార్ డా. అందె ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. ఈనెల18న నెల్లూరు లోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల 22వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు న్నాయన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులందజేశారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కళాశాల డీన్ బి.సుధారాణి, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ యన్.కృష్ణకుమార్, అకడమిక్ ప్రిన్సిపాల్ యస్.నాగయ్య పాల్గొన్నారు.

# జగన్ సర్కార్‌లో ప్రగతి చక్రాలు వెనక్కి!

## - టీడీపీ నేతల విమర్శ



వైయస్ జగన్మోహన్‌రెడ్డి అస్తవ్యస్థ పరిపాలనతో రాష్ట్ర ప్రగతి చక్రాలు వెనక్కి తిరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఈనెల 19వతేదీన తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రను నెల్లూరులోని వెంకటేశ్వరపురం నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమం సంక్షోభంలో ఉందని, లిక్కర్, ల్యాండ్, శాండ్ మాఫియాలే రాజ్యమేలు తున్నాయని విమర్శించారు. ప్రజలు ఏదో ఆశించి 151 సీట్లలో గెలిపిస్తే, వైసిపి ప్రభుత్వం వున్న సంక్షేమ పథకాలను వూడ గొడుతూ, అర్హులకు పింఛన్‌లు, అమ్మఒడి, రేషన్‌కార్డులు లేకుండా చేస్తూ, ఓట్లేసిన ప్రజలకు ద్రోహం చేస్తుందన్నారు. సీఎంగా జగన్ అపరిపక్వత వల్ల రాష్ట్రం 15ఏళ్లు వెనక్కిపోయిందని ఆయన ఆరోపించారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు వెంక టేశ్వరపురం సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి, మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

## 'ప్రభా'తం

# కాంగ్రెస్ అవయవదానం

నిన్నటి ఢిల్లీ ఫలితాలను చూస్తే కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అర్ధమవుతోంది. ఢిల్లీ రాష్ట్రాన్ని మూడుసార్లు ఏలిన పార్టీ... ఇప్పుడు 3శాతం ఓట్లకు పడిపోయింది. ఢిల్లీ ఎన్నికల్లో 'ఆప్'ను గెలిపించాలన్న దానికన్నా బీజేపీని ఓడించాలన్న కసితో కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును 'ఆప్'కు బదలాయించింది. అంటే ఇది ఒక రకంగా అవయవదానమన్నమాట. కాంగ్రెస్ బ్రైన్‌డెడ్‌కు గురయ్యింది. ఆ పార్టీ ఎలాగూ ఛస్తుంది కాబట్టి, తన అవయవాలను ప్రాంతీయ పార్టీలకు దానం చేసి వాటికి జీవం పోస్తుందన్నమాట.

పూర్వం అఖండ భారతదేశంలో చిన్నచిన్న హిందూ రాజ్యాలు ఉండేవి. వీళ్లకు ఒకరికొకరికి పడేది కాదు. రాజ్యకాంక్షతో యుద్ధాలు చేసుకుంటుండేవాళ్ళు. భారతదేశంలోని రాజ్యాలపైకి మొఘలులు దండెత్తి వచ్చినప్పుడు వాళ్ళకు స్థానిక రాజులే సహకరించారు. వారితో చేరి తమ శత్రురాజులను ఓడించేవాళ్ళు. కాలక్రమంలో మొఘలులు అన్ని రాజ్యాలను ఆక్రమించేశారు. శత్రువును ఓడించడానికి మన బలం చాలనప్పుడు ఇంకొకరి ద్వారా ఓడించడం అన్న యుద్ధం సూత్రం అప్పట్లోనే ఆచరణలో వుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ దానిని ఆచరణలో చూపిస్తోంది.

భారతదేశ రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితులను కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు ఎదుర్కొంటోంది. ఒకప్పుడు కాంగ్రెస్ అంటే గజరాజు, దీనిని బంధించడానికి గడ్డిపోచల్లాంటి ప్రాంతీయ పార్టీలనన్నింటిని ఏకం చేయాల్సి వచ్చేది. ఈకోవలో పుట్టినవే జనతాపార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీఏ కూటములు. అప్పట్లో ఏనుగులావున్న కాంగ్రెస్ ఇప్పుడు చిట్టెలుకలా అయ్యింది. ఈరోజు తన ప్రధాన ప్రత్యర్థి అయిన బీజేపీని ఎదుర్కోవడానికి ఆ పార్టీ ప్రాంతీయ పార్టీల మీద ఆధారపడుతోంది. ఆ పార్టీకి ఇంతకంటే సిగ్గుచేటైన విషయం ఇంకొకటుంటుందా?

ఇటీవల ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీలో 'ఆప్' విజయాన్ని కీర్తిస్తూ, అరవింద్ కేజ్రీవాల్‌ను పొగుడుతూ, ఇది బీజేపీకి పరాభవంగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఒక ట్వీట్ చేశాడు. దీనికి మరో కాంగ్రెస్ నాయకురాలు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె షర్మిష్టా చటర్జీ కర్రుకాల్చి వాతపెట్టినట్లు సమాధానం చెప్పారు. బీజేపీ ఓడిపోయిందని సంబరపడుతున్నారు... కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోవడం గుర్తించారా? కాంగ్రెస్‌ను ఏం చేద్దాం... అన్ని రాష్ట్రాలలో దుకాణాలు కట్టేద్దామా... అంటూ ఆమె విరుచుకుపడ్డ తీరు కాంగ్రెస్ నేతల చెంప చెళ్లుమనిపించింది.

నిజమే... ఆమె అన్నది అక్షరాలా వాస్తవమే. కాంగ్రెస్ పార్టీ గత కొన్నేళ్లుగా ప్రాంతీయ పార్టీల గెలుపులో తన సంతోషాన్ని వెదుక్కుంటోంది. బీజేపీ ఓటమితో సంబరాలు చేసుకుంటోంది. అంతేగాని, ప్రాంతీయపార్టీలు గెలిచినా, బీజేపీ ఓడినా తాను దిగజారిపోతున్న స్థితిని గమనించుకోవడం లేదు.

నిన్నటి ఢిల్లీ ఫలితాలను చూస్తే కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అర్ధమవుతోంది. ఢిల్లీ రాష్ట్రాన్ని మూడుసార్లు ఏలిన పార్టీ... ఇప్పుడు 3శాతం ఓట్లకు పడిపోయింది. ఢిల్లీ ఎన్నికల్లో 'ఆప్'ను గెలిపించాలన్న దానికన్నా బీజేపీని ఓడించాలన్న కసితో కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును 'ఆప్'కు బదలాయించింది. అంటే ఇది ఒక రకంగా అవయవదానమన్నమాట. కాంగ్రెస్ బ్రైన్‌డెడ్‌కు గురయ్యింది. ఆ పార్టీ ఎలాగూ ఛస్తుంది కాబట్టి, తన అవయవాలను ప్రాంతీయ పార్టీలకు దానం చేసి వాటికి జీవం పోస్తుందన్నమాట.

ఇప్పుడు ఢిల్లీ ఎన్నికల్లో జరిగింది ఇదే! మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిందీ ఇదే! మహారాష్ట్రలో బీజేపీని ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా నిరోధించడానికి, జీవితకాలం బద్ధశత్రువుగా వ్యవహరించిన శివసేనను అధికారపీఠమెక్కించింది. ఇక్కడ కాంగ్రెస్‌కు శివసేన అంటే ప్రేమ లేదు, బీజేపీని అధికారంలో ఉండనీయకూడదు అన్నదే లక్ష్యం. ఏడాది క్రితం కర్నాటకలో చేసింది కూడా ఇదే! బీజేపీని నిలువరించేందుకు కుమారస్వామిని గద్దెనెక్కించారు. ఆరు నెలలకే ఆయనను కూల్చారు. తర్వాత బీజేపీ అధికారంలోకి రావడం తెలిసిందే! ఈమధ్య జార్ఖండ్ ఎన్నికలలోనూ ఇదే జరిగింది. బీజేపీని నిలువరించడానికి కాంగ్రెస్ జెఎంఎం గెలుపులో తన ఆనందాన్ని వెదుక్కుంది.

గతంలో ఆయా రాష్ట్రాలలో రాజకీయ పరిస్థితులు ఎలా వుండేవంటే... కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఇతర పార్టీలకు అధికారంలోకి రావడానికి అవకాశముండేది. కేంద్రంలోనైనా, ఆయా రాష్ట్రాలలోనైనా అదే పరిస్థితి. ఇప్పుడు పరిస్థితి ఎలా మారిందంటే కేంద్రంలో బీజేపీ మీద ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వస్తేనే, అలాగే ఆయా రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాల మీద వ్యతిరేకత వస్తేనే కాంగ్రెస్‌పార్టీ వైపు జనం చూస్తున్నారు.

2014 ఎన్నిల నుండి కాంగ్రెస్ పతనం పూర్తి స్థాయిలో ప్రారంభమైంది. ఆ ఎన్నికల్లో 44 సీట్లకే ఆ పార్టీ పరిమితం కావడం చరిత్రలోనే ఆ పార్టీకి మాయని మచ్చ. 2019 ఎన్నికల్లో చూస్తే పరిస్థితి అంతకన్నా మెరుగుపడిందేమీ లేదు. ఈమధ్య మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, అది అక్కడి బీజేపీ ప్రభుత్వాలపై నెలకొన్న కొంత అసంతృప్తి వల్లేగాని, కాంగ్రెస్ ఘనత కాదు. ఆ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు బదులుగా 'ఆప్','వైసిపి' వంటి ప్రాంతీయ పార్టీలు వుండుంటే కాంగ్రెస్‌కు ఆ అవకాశం కూడా వుండేదికాదు.

బీజేపీ, కాంగ్రెస్‌లు బలంగా వున్న రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్ అధికార పక్షంగానో, ప్రతిపక్షంగానో నిలదొక్కుకుంటోంది. బీజేపీ, ఇంకో ప్రాంతీయపార్టీ ఉన్న రాష్ట్రాలలో మాత్రం కాంగ్రెస్ అంతరించిపోతోంది. కాలక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ప్రాంతీయపార్టీల మీద ఆధారపడే మనుగడ కొనసాగించబోతోంది...!

## బారకాసు రామాలయంలో ప్రత్యేక పూజలు

నెల్లూరులోని బారకాసు సెంటర్‌లో ఉన్న శ్రీరామమందిరం వార్షికోత్సవాన్ని ఈనెల 14న ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాలతో ఎంతో విశిష్టంగా పూజలు నిర్వహించారు. స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూలంగిసేవ, అనంతరం సహస్రనామ పూజలు చేశారు. ఈ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహప్రతిష్ట జరిగి ఏడు సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో ఈ వార్షికోత్సవ వేడుకలతో ఆలయానికి కొత్తకళ వచ్చింది. ఎంతోమంది భక్తులు ఈ వార్షికోత్సవంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు..మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య, ఆలయ అధ్యక్షుడు చాకిరాల శేషయ్య, కార్యదర్శి వరిగొండ సురేష్‌బాబు తదితరుల పర్యవేక్షణలో ఈ వార్షికోత్సవ వేడుక ఎంతో కనువిందుగా జరిగింది.

## ఆలయాల ఆస్తులకు రక్షణ కల్పించాలి

నెల్లూరు జిల్లాలోని ఆలయాలు, ఆలయ ఆస్తులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ కోరారు. బోగోలు మండలం కొండబిట్రగుంట లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ రథం దహనం కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నెల్లూరులోని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డికి ఈనెల 15 న వినతిపత్రం అందజేశారు. ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ తదితర సంస్థల నేతలు సాయి శ్రీనివాసులు, జగన్మోహన్‌రావు, సుబ్బయ్య, రత్నం, నాగఫణిశర్మ, వీరాస్వామి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాలకు శివరాత్రి శోభ



విద్యుత్‌దీప కాంతులలో మూలాపేట శివాలయం

జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ మహాశివరాత్రి శోభతో కళకళలాడుతున్నాయి. ఈ నెల 21వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవాలయాలలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. అలాగే శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఉత్సవాలు కూడా జరుగుతున్నాయి. శివరాత్రిని పురస్కరించుకుని నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, గండవరం శివాలయం, రామతీర్థం, సిద్ధలయ్యకోన, సోమశిలలోని సోమేశ్వరాలయం... ఇంకా పలు ప్రసిద్ధ శివాలయాలు ప్రత్యేక అలంకారాలతో కళకళలాడుతున్నాయి.

## ఈ-చలానా రద్దు చేయాలంటూ ఆటో కార్మికుల ప్రదర్శన

అధికారులు పలురకాల కారణాలతో విధిస్తున్న ఈ-చలానా విధానం వల్ల ఆటోకార్మికులు ఇబ్బందిపడుతున్నారని, ఉన్నతాధికారులు వెంటనే ఈ విషయం పరిశీలించి ఈ-చలానా రద్దు చేయాలని కోరుతూ ఆటో కార్మికసంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న నెల్లూరు నగరంలో ఆటోకార్మికులు ఆర్టీసి బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఆటో కార్మికసంఘం జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలని కోరారు. సంఘం రూరల్ కార్యదర్శి సుధాకర్, సంపత్‌కుమార్, శ్యాంసన్, లవణ్‌కుమార్, జనార్ధన్, కాలేషా, గోపి, శేషయ్య పాల్గొన్నారు.




### నిజాయితీ పాలనకు ఫలితమది

ఢిల్లీ రాష్ట్ర ఎన్నికలలో 'ఆప్' విజయం ఊహించినదే! ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఒక సగటు మనిషిగా వ్యవహరించాడు. ఆర్భాటాలకు పోలేదు, ప్రజలకు అందుబాటులో వున్నాడు. ఢిల్లీ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎంతో చొరవ చూపాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ప్రజల ముఖ్యమంత్రి కాబట్టే ఆయనను మళ్ళీ గెలిపించారు.

**జర్రి మల్లిఖార్జున్, నెల్లూరు.**

### హోదా సాధించాలి

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్డీఏలో చేరితే మంచిదే! అయితే కేంద్ర ప్రభుత్వం నుండి తగిన హామీలు వచ్చాకే ఆయన ఎన్డీఏలో చేరాలి. ముఖ్యంగా ప్రత్యేక హోదా నినాదాన్ని ప్రతిపక్ష నేతగా వున్న సమయంలో జగన్ ప్రజల్లోకి తీసుకెళ్లాడు. ఆయన విజయంలో ప్రత్యేకహోదా ఉద్యమం కూడా ప్రధానపాత్ర పోషించింది. కాబట్టి కేంద్రం నుండి ప్రత్యేకహోదాపై హామీ తీసుకున్నాకే ఎన్డీఏలో చేరాలి.

**తూపిలి రాజేశ్వరరెడ్డి, కొత్తూరు.**

### స్వాములూ... సామాన్యులనూ చూడండి

హిందూ మతం నుండి ఇతర మతాల్లోకి వలసలకు కారణం కుల వివక్ష. ఇందులో పీఠాధిపతులు, బాబాలు, స్వామీజీల పాత్ర కూడా వుంది. హిందూ సంస్కృతి పరిరక్షణకు పూనుకున్నామని ధర్మబోధనలు చేసే స్వాములు ఏ రోజన్నా దళితవాడల్లో తిరగడం, వారికి హిందూ ధర్మం పట్ల ఆసక్తి కల్పించడం చేశారా? దళిత వాడల్లో తిరిగితే మైలపడతామనుకుంటున్నారా? పెద్దపెద్దోళ్ళ ఇళ్లకు వెళ్లడంలో తప్పులేదు, అదే సమయంలో పేదోళ్ల ఇళ్లకు కూడా పోండి, దళితవాడలు, గిరిజన కాలనీలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టండి. దేవుడి ముందు అందరూ సమానమనే భావన కల్పించండి, హిందూ సంస్కృతి యొక్క గొప్పతనాన్ని తెలియజేయండి. అప్పుడు మతమార్పిళ్ళు ఎందుకుంటాయి.

**సి. రాజీవి, నెల్లూరు.**




# అన్నదమ్ముల అనుబంధం...
# సవాల్‌గా మారనుందా?

**ఆనం సోదరులు, నేదురుమల్లి సోదరులు, మాగుంట సోదరులు, నల్లపరెడ్డి సోదరులు, బెజవాడ సోదరులు, మేకపాటి సోదరులు... జిల్లా రాజకీయ చరిత్రలో మనకు కనిపించిన సోదరులు. అయితే వీరంతా కూడా రెడ్డి సామాజికవర్గానికి చెందినవాళ్ళే! కాని, బి.సి వర్గాల నుండి జిల్లా రాజకీయ తెరపై ఫోకస్ అయిన సోదరద్వయం బీద సోదరులు.**

రెండు దశాబ్దాల నుండి జిల్లా రాజకీయాలలో బాగా నానుతున్న పేరు. సొంత సోదరులు కానప్పటికీ, అన్నదమ్ముల బిడ్డలైనప్పటికీ సొంత అన్నదమ్ముల కంటే ఎక్కువుగా ఒకరికొకరు ఇంతకాలం సహకరించుకున్నారు. ఇద్దరు కూడా 20ఏళ్లకుపైగా ఒకే పార్టీలో కొనసాగారు. బీద మస్తాన్‌రావు ఎన్నికల్లో పోటీ చేస్తే బీద రవిచంద్ర వ్యూహరచన చేసేవాడు. పార్టీలో బీద రవిచంద్ర రాజకీయ ఎదుగుదలకు బీద మస్తాన్‌రావు సహకరించేవాడు.

ఒక రాజకీయ కుటుంబం కలిసి వున్నంత కాలమే బలంగా వుంటుంది. అన్నదమ్ముల మధ్య విభేదాలొచ్చి విడిపోయారంటే మాత్రం రాజకీయంగా బలహీనపడడం మొదలైనట్లే! దీనికి ఉదాహరణగా ఆనం సోదరులను చెప్పుకోవచ్చు. నలుగురు అన్నదమ్ములు కలిసివున్నంత కాలం జిల్లా రాజకీయాలలో వారికి తిరుగులేకుండా పోయింది. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా జిల్లా రాజకీయాలలో చక్రం తిప్పారు. ఎప్పుడైతే అన్నదమ్ముల మధ్య విభేదాలొచ్చాయో అప్పటి నుండే ఆనం వర్గం జిల్లాలో బలహీనపడుతూ వచ్చింది. అంతేకాదు, రాజకీయంగా ప్రాభవం కోల్పోవడం కూడా మొదలైంది.

ఇప్పుడు బీద సోదరులది కూడా అదే పరిస్థితి. బీద మస్తాన్‌రావు, రవిచంద్రలు కలిసి వున్నంత కాలం బలంగా కనిపించారు. ముఖ్యంగా వారి సొంత గ్రామం ఇస్కపల్లి వారి కంచుకోటగా వుండేది. ఇటీవల బీద మస్తాన్‌రావు వైసిపిలో చేరిపోగా, బీద రవిచంద్ర తెలుగుదేశంలోనే వుండిపోయాడు. ఇప్పుడు చెరొక పార్టీ అయ్యారు. బీద మస్తాన్‌రావు టీడీపీలో వున్న తన అనుచరులను వైసిపిలోకి తీసుకుపోవడం మొదలుపెట్టాడు. ఇందులో ఇస్కపల్లి గ్రామస్తులు కూడా వున్నారు. అంటే బీద రవిచంద్ర వర్గం బలహీన పడుతున్నట్లే! అనుచరగణాన్ని చెరిసగం పంచుకుంటే రాజకీయంగా ఇద్దరూ తగ్గినట్లే అవుతుంది. రాజకీయంగా ప్రాబల్యం తగ్గింది కాబట్టే నోరు జారి ఒక మాటన్నందుకు బీద రవిచంద్ర సొంత గ్రామస్థుల చేతే బహిష్కరించబడ్డాడు.

తనకు ఇలాంటి పరిస్థితి వస్తుందని రవిచంద్ర కలలో కూడా వూహించి వుండడు. అన్నదమ్ములు విడిపోవడంతోనే వాళ్లకు బ్యాడ్‌టైం స్టార్ట్ అయినట్లయ్యింది.

# పేదల పెన్నిధి.. సీఎం సహాయనిధి

**ఎంపి ఆదాల**



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు సీఎం సహాయనిధి ఆపన్నహస్తం లాంటిదని నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నాడు. ఇటీవల నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన సీఎం సహాయనిధి క్రింద 14 మందికి 10 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదకుటుంబానికి విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పాడు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా వుండాలని, ఎలాంటి రోగాలకైనా చికిత్స చేయించుకునే విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని ఆయన అన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు సి.కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, బట్టేపాటి నరేంద్ర, పాముల హరిప్రసాద్, అబూబకర్, నరసింహరావు, అవినాష్, జనార్ధన్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఆశావహుల్లో టెన్షన్



## • మేయర్ రిజర్వేషన్

**నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్... జిల్లా పరిధిలో వున్న పదవుల్లో జడ్పీ ఛైర్మెన్ తర్వాత శక్తివంతమైన పదవి. దాదాపు 8లక్షల జనాభాకు ప్రథమ పౌరుడు. రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఇద్దరు ఎమ్మెల్యేలతో ముడిపడివున్న పదవి.**

2007 వరకు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌గా వుండేది. ఆ ఏడాది కార్పొరేషన్ అయ్యింది. అంతవరకు నెల్లూరు నగర అసెంబ్లీ ఒక్కటే ఉండేది. ఎవరు మున్సిపల్ ఛైర్మెన్‌గా వున్నా ఎమ్మెల్యేలుగా వున్నవారితో స్వతహాగానే పడకుండా వచ్చేది. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వాళ్ళుంటే మున్సిపల్ ఛైర్మెన్ తెలుగుదేశంవారై వుండడం, లేదా ఎమ్మెల్యే తెలుగుదేశం నాయకుడై వుంటే మున్సిపల్ ఛైర్మెన్ కాంగ్రెస్ నాయకుడై వుండడం వుంటూ వచ్చింది.

నెల్లూరు మున్సిపాల్టీ కార్పొరేషన్‌గా మారాకే అటు ఎమ్మెల్యేలుగా, ఇటు మేయర్‌గా ఒకే పార్టీ గెలుస్తూ వచ్చింది. అయితే నెల్లూరు తొలి మేయర్ పులిమి శైలజకు, అప్పటి నగర ఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డికి మధ్య వైరం నడవడం తెలిసిందే! ఆమెను దించి భానుశ్రీని మేయర్‌ను చేశాకే సయోధ్య కుదిరిది.

2009 ఎన్నికల్లో నెల్లూరు నగరంలో ప్రజారాజ్యం ఎమ్మెల్యేగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రూరల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం వివేకానందరెడ్డి గెలవడం, ముంగమూరు కూడా తర్వాత కాలంలో కాంగ్రెస్‌లో విలీనం కావడం తెలిసిందే! వివేకా నేతృత్వంలోనే కార్పొరేషన్ పాలన నడిచింది. 2014 ఎన్నికల్లో మాత్రం ఇటు రెండు అసెంబ్లీలోనూ, అటు కార్పొరేషన్ లోనూ వైసిపి అభ్యర్థులు గెలిచారు. అయితే మేయర్‌గా ఎన్నికైన అబ్దుల్ అజీజ్ ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది.

ఇప్పుడు మరోసారి కార్పొరేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. నెల్లూరుకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు కూడా మేయర్ సీట్లో కూర్చునే వ్యక్తి చాలా కీలకం. ఒకరకంగా నగరంలో ఇది మూడో పవర్ పాయింట్. ఇప్పటికి కార్పొరేషన్‌కు రెండు సార్లు ఎన్నికలు జరుగగా మేయర్ పదవి మొదటిసారి జనరల్ మహిళకు, రెండోసారి బి.సి జనరల్‌కు కేటాయించారు. ఈసారి కూడా రిజర్వేషన్ మారే అవకాశముంది. ఇది ఏ కేటగిరిలో రిజర్వేషన్ అవుతుందోననే ఉత్కంఠ ఆశావహుల్లో వుంది. ఓసి జనరల్ అయితే పోటీ చేయాలని ఇద్దరు నాయకులు ఆశలు పెంచుకుని వున్నారు. బి.సి జనరల్ అయితే రూప్‌కుమార్ యాదవ్‌కు అవకాశముంటుందనే ప్రచారం వుంది. అయితే ఈ తలనొప్పులేమీ లేకుండా ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారన్న ప్రచారం కూడా షికారు కొడుతోంది. మొత్తంమీద మేయర్ రిజర్వేషన్ నేతల్లో టెన్షన్ కలిగిస్తోంది.

## ప్రశ్నల వర్షంలో...
# విపిఆర్‌కు రెండో స్థానం



పార్లమెంటులో రాజ్యసభ సభ్యునిగా తొలిసారి అడుగుపెట్టినప్పటికీ ప్రజా సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించడంలో రాజ్యసభ సభ్యుడు, నెల్లూరీయుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దూసుకుపోతున్నాడు. ఈ విషయంలో ఆయన సీనియర్ పార్లమెంటేరియన్‌ల కంటే ముందుండడం గమనార్హం. ఈ బడ్జెట్ సమావేశాలలోనూ ఆయన పలు సమస్యలపై ప్రశ్నలు సంధించాడు. బడ్జెట్ సెషన్స్ సందర్భంగా మొదటి అర్ధభాగంలో ప్రశ్నలు అడగడంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 17 ప్రశ్నలతో రెండవ స్థానంలో నిలిచాడు. తృణమూల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ డెరెక్ ఓబ్రియన్ 18 ప్రశ్నలతో మొదటి స్థానంలో వున్నాడు. రాజ్యసభలో విపిఆర్ బొగ్గగనుల వేలం, సోలార్ విద్యుచ్ఛక్తి, శిశు మరణాలు, నెల్లూరులోని క్రీడా అకాడమీ, రైతుల బీమా చెల్లింపులు, కేంద్రీయ విద్యాలయాలలో ఖాళీలు భర్తీ వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించడం జరిగింది.

# కావలి ఏఎంసి ఛైర్మెన్‌గా మన్నెమాల



కావలి వ్యవసాయ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్‌గా మన్నెమాల సుకుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ నెల 22వ తేదీన ఆయన ప్రమాణస్వీకారం చేయబోతున్నారు.

కావలికి రెండో ఎమ్మెల్యేగా, షాడో ఎమ్మెల్యేగా సుకుమార్‌రెడ్డికి పేరుంది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కుడి, ఎడమ భుజాల్లాంటోడు. ఆయనకు ఈ మాత్రం పదవి వూహించినదే!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



### నెల్లూరు ఏఎస్పీగా
## వెంకటరత్నమ్మ

నెల్లూరుజిల్లా అడ్మిన్ ఏఎస్పీగా వి.వెంకటరత్నమ్మను నియమిస్తూ డిజిపి గౌతం సవాంగ్ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం సిఐడి విభాగంలో డిఎస్పీగా పనిచేస్తున్న వెంకటరత్నమ్మకు పదోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారిణి అయిన ఆమె గతంలో తెలంగాణలో పలు చోట్ల డిఎస్పీగా పని చేశారు.

## గిన్నీస్ బుక్‌లో శారదామణి



నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని రాంజీనగర్‌కు చెందిన పాబోలు శారదామణికి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లభించింది. 2019 ఆగస్టులో బెంగళూరులో నిర్వహించిన టెక్స్‌టైల్స్ డాల్స్ ఎగ్జిబిషన్‌లో శారదామణి ఆమె మిత్ర బృందం ఏర్పాటు చేసిన 2500 టెక్స్‌టైల్ త్రీడీ బొమ్మలకు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లభించడం విశేషం! ఈ ప్రదర్శనలో బాహుబలి కాన్సెప్ట్‌తో 12 అంగుళాల సూక్ష్మకళాఖండాలను తీర్చిదిద్దారు. ఆ రికార్డును ఆమె 2020జనవరిలో అందుకున్నారు. దీనికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు ఇటీవలే ఆమెకు చేరగా, వాటి వివరాలను విలేకరులకు వెల్లడించారు. శారదామణిని గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, రికార్డు హోల్డర్స్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డులు వరించాయి. సింహపురి కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన శారదామణిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

### ఫ్రెండ్స్ వాకర్స్
## డైరెక్టరీ ఆవిష్కరణ



ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ ఎంవీ సుబ్బారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్రెండ్స్ వాకర్స్ డైరెక్టరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పడినప్పటి నుండి నేటి వరకు చేసిన సేవా కార్యక్రమాలు, ఫోటోలు, సభ్యుల వివరాలు, చిరునామాలతో ఈ డైరెక్టరీని రూపొందించామన్నారు. ఇది సభ్యులకు ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ ఎన్నికల్లో విజయం సాధించిన వాకర్ బి.మనోహర్‌రెడ్డిని సత్కరించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ కృష్ణయ్య, కార్యదర్శి శ్రీమన్నారాయణ, కోశాధికారి వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## 24న టెండర్లు

నెల్లూరురూరల్, నరసింహకొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పలు అంశాలకు సంబంధించి నిర్వహించాల్సిన సీల్డ టెండర్లను ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపాడు.

# నెల్లూరు కబుర్లు

## ఇంటర్ పరీక్షా పత్రాలు వచ్చేశాయ్

మార్చి నాలుగవ తేదీ నుండి జరుగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు జిల్లాకు చేరాయి. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కెఎసి జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో వీటిని భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌కు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలకు వారం ముందు ఈ ప్రశ్నాపత్రాలను ఆయా పరీక్షా కేంద్రాల సమీప పోలీస్ స్టేషన్‌లకు చేరుస్తారు.

## రేషన్‌కార్డుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 76,107 మంది అర్హులైన వారికి బియ్యం కార్డులు మంజూరు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్ తెలిపారు. ఇటీవల తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్లు, విఆర్‌ఓల ద్వారా లబ్దిదారులు ఇళ్లకే కార్డులు చేరుస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 69,472 రేషన్‌కార్డుల పునఃపరిశీలన జరుగుతున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి ఇంటింటికి నాణ్యమైన బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీకి దరఖాస్తులు

మార్చి 7వ తేదీ నుండి జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోతే గ్రామ, వార్డు సచివాలయాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను తీసుకునే ప్రక్రియ నిరంతరం జరుగుతుంటుందని ఆయన పేర్కొన్నారు.

## కోడికి కరోనా ఎఫెక్ట్



కార్తీకమాసం వచ్చిందంటే చికెన్ ధరలు అమాంతం పడిపోతాయి. తినే వాళ్ళు తగ్గిపోతారు. ఇప్పుడు కార్తీకమాసమే కాదు కరోనా వైరస్ కూడా చికెన్ ధరల మీద ప్రభావం చూపుతోంది. పశు, పక్షుల మాంసం వల్లే కరోనా వైరస్ వ్యాపిస్తుందన్న ప్రచారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

దీంతో ఎందుకొచ్చిన తలనొప్పిలే అని చాలా మంది మాంసాహారం తగ్గించుకున్నారు. కొందరు నాటుకోళ్ళ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చికెన్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.

### కేంద్ర నిర్ణయంపై..
## కాంగ్రెస్ నిరసన

రిజర్వేషన్ల విధానంలో కేంద్రప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 14 నెల్లూరు విఆర్‌సి సెంటర్ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. పార్టీ నాయకులు ఫయాజ్, కరిముల్లా, అల్లాఉద్దీన్, రాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డా.అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు.



## బెదురుపెట్టేందుకేనా?

ఈ నెల 18వ తేదీన అవినీతి నిరోధక శాఖాధికారులు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న రికార్డులను పరిశీలించారు. ఇదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాలలో ఏసిబి తనిఖీలు జరగడం విశేషం. ప్రభుత్వ శాఖలలో అవినీతిని రూపుమాపాలని సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి పంతం పట్టివున్నారు. ఇందుకోసం ఏసిబిని పూర్తిస్థాయిలో వాడుకోవడానికి సిద్ధమయ్యారు. మున్సిపాల్టీలో చూస్తే టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి ఎక్కువుగా వుంటుందనేది తెలిసిందే! అందుకే ముందస్తు బెదురుపెట్టేందుకే ఈ శాంపిల్ తనిఖీలు జరిగాయేమోననిపిస్తోంది. ఇది ట్రైలర్ అయితే రాబోయేకాలంలో ఇక సినిమానే!

## మరీ 'ఒత్తొ'ద్దు

**- రవీంద్రబాబు**

టెలికాన్ఫరెన్స్‌ల పేరుతో ఉద్యోగులను ఆదివారాలు కూడా వదలకుండా ఒత్తిడి పెంచడం సరికాదని ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చొప్పా రవీంద్రబాబు పేర్కొన్నారు. 16వ తేదీ నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెలికాన్ఫరెన్స్‌ల పేరుతో కొందరు ఉన్నతాధికారులు ఉద్యోగులను సతాయిస్తుంటే, ఇంకొందరు అధికారులు ఆదివారాలు కూడా తిప్పుకుంటున్నారు. సెలవు లేకుండా ఉద్యోగులు పని చేయాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొని వుందన్నారు. ఆఫీసులలో సమయపాలన పాటించాలని, ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5 గంటల దాకా ఉద్యోగుల విధి నిర్వహణ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు బయోమెట్రిక్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఏనుగు రమణారెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు, ఆరంబాకం చంద్రశేఖర్, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## ఏసునాయుడుకు సత్కారం



నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంబేటి ఏసునాయుడును ఆదివారం నెల్లూరు, పొదలకూరురోడ్డులోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు లాజరస్, ఏసుదయ, టి.బాలసుధాకర్, మేరీ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు

నెల్లూరు జిల్లాకు ఇద్దరు డీఎస్పీలకు చోటు కల్పించారు. డీజీ కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న 37 మంది డీఎస్పీలకు ఈనెల 15న పోస్టింగులను కేటాయిస్తూ డీజీపీ గౌతం సవాంగ్ ఉత్తర్వులు జారీచేశారు. నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా యు.నాగరాజును, పోలీసు శిక్షణ కళాశాల డీఎస్పీగా ఎస్‌వి గోపాలకృష్ణను నియమించారు.

### సచివాలయ ఉద్యోగుల సంఘం
## తొలి కార్యవర్గం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా తొలి కార్యవర్గం ఏర్పాటయ్యింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి జివివి రాఘవరెడ్డి ఉద్యోగుల సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులుగా మల్లంపూడి సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.అమర్‌నాథ్, పి.హరికృష్ణ, ఎం.అపర్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీకర్, జి.రమాదేవి, నాగినేని కోటయ్యనాయుడు, కోశాధికారిగా మారెళ్ల శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్ సుజిత, ఎం.కోటేశ్వరరావు, ఎం.వినీల, రెడ్డిచర్ల సురేష్, పోరుమావిళ్ల శివలను నియమించారు.

## అప్పుడే సుర్రుమనిపిస్తున్నాడు



ఇంకా మార్చిలోకి కూడా వెళ్లలేదు.. అప్పుడే ఎండలు సుర్రుమనిపిస్తున్నాయి. గతేడాది వర్షాలు బాగానే పడ్డాయి. ఈ ఏడాది ఎంత ఎండలు కాసినా నీళ్ళకు సమస్య వుండకపోవచ్చు. కాని ఎండలు మాత్రం యధాప్రకారం మిడిమేళంగానే కాసేటట్లున్నాయి.

### నాన్‌స్టాప్ సర్వీసులకు
## రెండే స్టాపింగ్‌లు



నెల్లూరు - తిరుపతి మధ్య నడిచే నాన్‌స్టాప్ ఆర్టీసీ సర్వీసులకు నగరంలో ఇక రెండు స్టాపింగ్‌లే వుంటాయని ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతిరోజూ ఉదయం 4.30 గంటల నుండి రాత్రి 7గంటల దాకా ప్రతి 20 నిముషాలకు ఓ నాన్‌స్టాప్ బస్సు తిరుపతికి బయలుదేరుతుంది. అయితే ఇప్పటివరకు ఈ బస్సులు నగర పరిధిలో ప్రయాణీకులు ఎక్కడ చెయ్యెత్తినా ఆపేవాళ్ళు. దీనివల్ల 2.30 గంటల్లో తిరుపతికి చేరాల్సిన బస్సులు అరగంటకు పైగా ఆలస్యమవుతున్నాయి. నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఎక్కినా, మామూలు బస్సుల్లో ఎక్కినా తిరుపతికి ఒకే టైం పడుతోందనే ఫిర్యాదులు రావడంతో ఇక నాన్‌స్టాప్‌లకు నగరంలో రెండే స్టాపింగ్‌లు నిర్ణయించారు. ఒక పాయింట్ ఆర్టీసీ బస్టాండ్ అయితే, రెండోది అయ్యప్పగుడి. నాన్‌స్టాప్ సర్వీసులలో తిరుపతికి వెళ్లాలనుకునే వాళ్ళు ఈ రెండు స్టాపింగ్‌ల వద్ద మాత్రమే బస్సులెక్కాల్సి వుంటుంది. అయితే బస్సు తిరుపతి నుండి వచ్చే సమయంలో మాత్రం నగరంలో ప్రయాణీకులు ఎక్కడ దిగాలంటే అక్కడ ఆపుతారు.

### క్లినిక్‌ను మూసేయడాన్ని నిరసిస్తూ
## బీజేపీ ధర్నా

టిపి గూడూరు మండలం పొట్లపూడిలో ఆర్‌ఎంపి విజయకుమార్ నిర్వహిస్తున్న క్లినిక్‌ను మూసివేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో 17వ తేదీ నెల్లూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్‌ఎంపి విజయకుమార్ బీజేపీ సానుభూతిపరుడని, ఆయన వైసిపిలో చేరలేదని కక్షగట్టి, అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆయన క్లినిక్‌ను మూయించారని ఆరోపించారు. అయితే డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి మాత్రం వారి ఆరోపణలను కొట్టిపారేశారు. మాపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్ళు లేవు, ఆర్‌ఎంపిలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చెయ్యాలి కాని ఇక్కడ మోతాదుకు మించి యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. ఇంజక్షన్లు చేస్తున్నారు, క్లినిక్ వద్ద టెలిమెడిసిన్ బోర్డును కూడా ఏర్పాటు చేశారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం వల్లే మూసేయించామని పేర్కొన్నారు.

# మెరుగైన విద్యుత్ కోసమే సబ్‌స్టేషన్లు

**- రాష్ట్ర మంత్రి అనిల్**



సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరంలో వేసవి కాలంలో విద్యుత్ అంతరాయాలను నివారించి మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈనెల 16న నెల్లూరు యలమవారిదిన్నెలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. 500యూనిట్లు దాటిన వారిపైన మాత్రమే ఛార్జీల భారం పడుతుం దన్నారు. ఈ విషయంలో జరుగుతున్న విష ప్రచారాన్ని వినియోగదారులు నమ్మద్దొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో విద్యుత్ అంతరాయాలు తక్కువగా ఉన్న జిల్లా నెల్లూరని మంత్రి తెలిపారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు రూప్‌కుమార్‌రెడ్డి, వై.వి.రామిరెడ్డి, ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి, ఏడీఈలు శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీని వాసులురెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రధానం

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి**



ప్రజలకు హాని కలిగించే ఫ్యాక్టరీలను నడుపుతూ వారి ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల 17న ఇందుకూరుపేట మండలంలోని రావూరులో వున్న డీఎస్ టెక్నో ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఫీడు ఫ్యాక్టరీతో రావూరుతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల తాను ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డితో కలిసి మైపాడులో పర్యటించినపుడు ఈ మార్గంలో వెళ్ళామని, ఇక్కడ విడుదలవుతున్న దుర్గంధాన్ని అరగంటసేపు భరించలేక పోయామన్నారు. గ్రామస్తులు మూడేళ్ళుగా ఎలా భరిస్తున్నారోనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలను సృష్టించే ఇలాంటి ఫ్యాక్టరీల విషయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న ఇలాంటి ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకుంటామన్నారు. పీసీబీ ఈఈ ప్రమోదరెడ్డి మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ కమిటీలో పెట్టి ఈ ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ రఫీఖాన్, సీఐ రామకృష్ణ, వైయస్సార్ సీపీ నాయకులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయకుమార్, ఉడతా వెంకటశేషయ్య, ముంగర శ్రీకాంత్, దిల్షాద్ పాల్గొన్నారు.

# ఏఐసిటిఈ ఛైర్మెన్‌ను సత్కరించిన రాంకుమార్




అనంతపురంలోని జెఎన్‌టియు(ఎ)లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి రెండవ టెక్నాలజీ యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్ల సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐసిటిఈ ఛైర్మెన్ అనిల్ సహస్రబుద్ధేని ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో సాంకేతిక కళాశాలల అభివృద్ధి, ఇటీవల ఏఐసిటిఈ విడుదల చేసిన హ్యాండ్ బుక్‌లో పొందుపరచిన విషయాలను మరియు కొత్త కోర్సుల గురించి చర్చించారు. ఛైర్మెన్ సాంకేతిక విద్యలో తీసుకురాబోయే విప్లవాత్మక మార్పులను ప్రతినిధులకు వివరించారు. భవిష్యత్‌లో టీచర్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం పూర్తి చేసిన వారిని మాత్రమే అధ్యాపకులుగా తీసుకోవాలనే నిబంధన తేనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు కళాశాలల తోడ్పాటు ఎంతో అవసరమని మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌ను ఆయన కోరారు.



# ఆములూరులో ఆధ్యాత్మిక సంబరం

- కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య చేతులమీదుగా వైభవంగా ఆములూరమ్మ దేవస్థానం మహాకుంభాభిషేకం



భక్తులకు ఆధ్యాతిక సందేశాన్నిస్తున్న శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి

వెల్లువలా వచ్చిన భక్తజన సందోహం మధ్య కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య హస్తాల మీదుగా టి.పి.గూడూరు మండలం సౌత్‌ఆములూరులోని గ్రామ దేవత శ్రీ ఆములూరమ్మ తల్లి దేవస్థానం నూతన విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం 14వ తేదీన అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణదాతలు నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచన, నంబూరు మనోజ్ - లత దంపతుల నేతృత్వంలో ఈనెల 12వతేదీ ఆలయంలో విఘ్నేశ్వరపూజ, శైవశుద్ధి, మహాపున్యహవచనం, పంచగవ్య ప్రాశన ప్రక్షానిధి, దీక్షా స్వీకరణ, యాగశాల ప్రవేశం, శాల బలి, అఖండ స్థాపన, యంత్రమాంత్రానుస్థానములు ప్రారంభమయ్యాయి. త్రిశూల పూజ, మూల భ్రమరాంబలకు అభ్యంగన స్నానం, పూజాహారతి, మంత్రపుష్పం వంటి ప్రత్యేకపూజలను ఎంతో నిష్టతో నిర్వహించారు. ఆరోజు ఉదయం అమ్మవారి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సాయంత్రం 6గంటల నుండి అంకురార్పణ వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తు బలి, అగ్ని మధనం, లక్ష్మీగణపతి పూజ ఆవరణహోమం, మూర్తి హోమం, జలాధివాసం వంటి ప్రత్యేకపూజలు నిర్వహించారు. 13వ తేదీ కూడా ఉదయం నుండి రాత్రి వరకు వివిధ రకాల పూజలు పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిగాయి.

14వ తేదీ ఉదయం 8గంటల నుండి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, లోహ న్యాసం, దాతున్యాహం, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాకుంభాభిషేక నిర్వహణ కోసం విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామికి వేదపండితులు మంత్రోచ్ఛాటనలు, మంగళ వాయిద్యాల మధ్య నంబూరు కుటుంబ సభ్యులు, సౌత్‌ఆములూరు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం వైభవంగా జరిగాయి. అనంతరం భక్తులకు శ్రీ విజయేంద్రసరస్వతి తన ఆధ్యాత్మిక ఉపదేశం అందించారు. ఈ సందర్భంగా నూతల పాటి వనమ్మ భోజనశాలను, విమాన శిఖరం, పోతురాజు స్వామి విగ్రహాన్ని, సింహవాహనాన్ని ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ప్రధాన అర్చకులు సుబ్బయ్యశాస్త్రి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఆములూరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

# ఇంటికే సంక్షేమం - ఎమ్మెల్యే ఆనం



రేషన్‌కార్డులు అందజేస్తున్న ఆనం, బల్లి దుర్గాప్రసాద్, సాయికృష్ణయాచేంద్ర

ఇంటింటికీ తలుపు తట్టిమరీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నాడు. 17వ తేదీన వెంకటగిరిలో కొత్త బియ్యం కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మొదలుపెట్టి మాట్లాడుతూ గతంలో వున్న రేషన్ కార్డుల్లో లోపాలను ప్రక్షాళన చేసి, కొత్తకార్డులను పంపిణీ చేస్తున్నామని, మార్చి 7వ తేదీలోగా అర్హులందరికీ బియ్యం కార్డులు అందజేస్తారని చెప్పారు. నవరత్నాల అమలుకు సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, రాష్ట్రంలో 56లక్షల మందికి ఇంటి తలుపు తట్టి పింఛన్‌లు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నాడు. ఉగాది నాటికి ఇల్లు లేని అర్హులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వబోతున్నారని, అన్ని వసతులతో ఆ స్థలాలను లే అవుట్లుగా మార్చి ఇళ్లను కూడా నిర్మించాలనే ఆలోచనలో ముఖ్య మంత్రి వున్నారని ఆనం చెప్పాడు. ఈ ప్రభుత్వంలో సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే అన్న హోదాలు లేవని, అందరం ప్రజలకు సేవకులమేనని అన్నాడు. తిరుపతి ఎంపి బల్లి దుర్గా ప్రసాద్, మాజీఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## రైతులకు అన్యాయం చేస్తే సహించం



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

గూడూరు పట్టణ పురవీధుల్లో ఈనెల 17న వ్యవసాయ కార్మికసంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించి రైతుల వద్ద ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశాడు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు బోనస్‌గా క్వింటాకు రూ. 500 రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించాలన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని తక్కువకు కొనుగోలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి, కేశవులు, పుట్టా శంకరయ్య, ముత్యాలయ్య, మణి, బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి విద్యార్థులకు రాత పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎన్‌సిసి ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని అన్ని కళాశాలలో ఎన్‌సిసి విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్‌కు సంబంధించి రాత పరీక్షను ఆదివారం కమాండర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ఎన్‌సిసి గుర్తింపు పొందిన కళాశాలల విద్యార్థులు మొత్తం 318 మంది పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులకు 'బి' సర్టిఫికేట్ ఎంతో అవసరమని, పరీక్ష తర్వాత 'సి' సర్టిఫికెట్ పరీక్షను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్మీ నేవీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాండర్లు షాజీజాన్, ఆర్‌కె సింగ్, పాండే, శ్రీనివాసన్, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, సురేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### కరాటే పోటీలలో 'అవెన్యూస్' విద్యార్థులకు

## బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నగరంలోని బ్రహ్మానందపురంలో ఉన్న అవెన్యూస్ సిబిఎస్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ విద్యార్థులను యాజమాన్యం పాఠశాలలో అభినందించింది. గత ఆదివారం ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన దేవ్‌గోజుద్యో కరాటేడో 7వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు కెకె నివితశ్రీ, నిలేష్‌కృష్ణ, ఫరహాన్‌అహ్మద్, శ్యామ్‌కశ్యప్‌లు పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వరప్రసాద్‌ను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

## వాకర్స్ క్లబ్ నూతన కమిటి

ఈ నెల 19వ తేదీ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు వాకర్స్ క్లబ్ నూతన కమిటీని ఆ క్లబ్ గౌరవాధ్యక్షులు, గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఎం.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా టి.పురుషోత్తం, కోశాధికారిగా కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా సిహెచ్ సుధాకర్, మహిళా ప్రతినిధిగా టి.విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు వాసుగౌడ్ తమ బాధ్యతను నూతన కమిటీకి అందజేశాడు. మాజీ గౌరవాధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ఐపిడిజి కె.మునిగిరీష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీలు



పట్టుబడిన వాహనాలతో డిఎస్పీ, సిఐలు, ఎస్సైలు

గూడూరు పట్టణంలోని అరుంధతీయపాలెంలో గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష ఆధ్వర్యంలో ఆదివారం భద్రతా వలయ విధులు(కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టి వలయంలా ఏర్పడి అణువణువు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ సోదాలు చేపట్టామని, సరైన ధ్రువపత్రాలు లేని 34 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలు స్వాధీనం చేసుకొన్నామని, 450 గ్రాముల గంజాయిని గుర్తించామని, నలుగురు సిఐలు 10 మంది ఎస్సైలు 110 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు దశరథరామారావు, రామకృష్ణారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తాం

**- మున్సిపల్ కమిషనర్ ఓబులేసు**



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని కమిషనర్ ఓబులేసు సోమవారం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల కోసమే కొనుగోలు కేంద్రాలు

గూడూరు, చిల్లకూరు మండలాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్ నల్లారెడ్డి రమేష్‌రెడ్డి రైతులను కోరాడు. ఈ యేడాది సాగునీరు పుష్కలంగా ఉండడంతో పంట దిగుబడులు బాగా వచ్చాయన్నాడు.

## ఆధునికత, ఆధ్యాత్మికత కలగలిసిన.. శ్రీసిటీ

**- ప్రశంసించిన శ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి**



శ్రీసిటీలోని శంకర నేత్రాలయను సందర్శించిన శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి

ఆధ్యాత్మిక గురువు, కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారిని దర్శించుకుని స్వామీజీ దీవెనలందుకోవడం శ్రీసిటీ పరిసరప్రాంతాల ప్రజలకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఈనెల 17వతేది రాత్రి 9గంటల ప్రాంతంలో శ్రీ స్వామివారు శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వేదపండితుల మధ్య శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వామీజీకి సంప్రదాయబద్ధంగా ఘనస్వాగతం పలికారు. ఇక్కడి బిజినెస్ సెంటర్‌లో స్వామీజీకి శ్రీసిటీ అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆధునికత, ఆధ్యాత్మికత కలగలసి అభివృద్ధి చెందుతున్న ప్రత్యేక ప్రాంతం శ్రీసిటీ అని అభివర్ణించారు. ఇక్కడ సుమారు 50వేల మందికి ఉపాధి కలుగుతుండడం తనకు సంతోషంగా ఉందని, కృషి, పట్టుదల ఉంటే.. అవి ఎల్లప్పుడూ మంచి ఫలితాలు సాధిస్తాయని శ్రీసిటీ విషయంలో మరోసారి రుజువైందని ప్రశంసించారు. తొలుత శ్రీ స్వామివారు శ్రీసిటీలోని శంకరనేత్రాలయ కంటి ఆసుపత్రి, కంచికామ కోటి చైల్డ్ ట్రస్ట్ ఆసుపత్రిని సందర్శించారు. గ్రామీణ ప్రజలకు వారందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని స్వామీజీ ప్రారంభోత్సవం చేశారు. ఆ రాత్రి శ్రీసిటీలో బసచేసిన స్వామివారు అనంతరం మద్రాసుకు బయలుదేరి వెళ్తూ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని, భక్తులను ఆశీర్వదించారు.

## ఉపాధి కల్పనలు భేష్

**- రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి**



శ్రీసిటీ ఉత్పత్తులను మంత్రికి సమర్పిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీలో ఉపాధి కల్పనలు భేషుగ్గా ఉన్నాయని, ప్రపంచంలోని 29 దేశాలకు చెందిన 187 పరిశ్రమలతో ఇక్కడ 50వేల మందికి పైగానే ఉపాధి పొందుతుండడం అభినందనీయమని, శ్రీసిటీ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, వాణిజ్యం, నైపుణ్య శిక్షణ శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల13న శ్రీసిటీలో జపాన్‌కు చెందిన ప్రముఖమైన టోరె ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ 'టోరె ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్' పేరుతో ఏర్పాటైన నూతన పరిశ్రమకు మంత్రి గౌతమ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేందుకు త్వరలో రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకువస్తున్నామని, ఈ విధానంలో నైపుణ్య శిక్షణాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయంతో పాటు దానికి అనుబంధంగా పలు కళాశాలలను ప్రారంభించడం ద్వారా నాణ్యమైన శ్రామికశక్తిని అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ కాన్సులర్ జనరల్ కొచిరో యుచియమ, టోరె ఇండస్ట్రీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మిట్సు ఒహయో, టోరె ఇండిమా మేనజింగ్ డైరెక్టర్ షిగెకజు సునగా, తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీసిటీలోని ఫాక్స్కాన్, ఎంఎస్‌ఆర్ గార్మెంట్ పరిశ్రమలను సందర్శించారు. రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ జె.సుబ్రహ్మణ్యం, చిత్తూరుజిల్లా కలెక్టర్ భరత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో రక్తదాన శిబిరం

శ్రీసిటీలోని థెర్మాక్స్ పరిశ్రమలో ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ వారిచే ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 55 మంది కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. థెర్మాక్స్ సంస్థ వ్యవస్థాపకులు ఆర్.డి.ఆరా వర్ధంతిని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని థెర్మాక్స్ ప్లాంట్ హెడ్ రవి ఇమాందార్ ప్రారంభించారు. తాము ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు చెప్పారు. గూడూరు ఏరియా ఆసుపత్రికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు..

# నలుగురు విద్యార్థుల ఎంపిక

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాసులు వెల్లడించారు. ఈ నెల 14న వెంకటాచలం మండలంలోని చెముడుగుంటలో ఉన్న సైన్స్ మ్యూజియంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 13 వరకు వైఎస్సార్ కడపజిల్లాలోని రాజంపేటలో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలు జరిగాయని, ఇందులో జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంతో ప్రతిభ చూపడంతో వారిని జాతీయస్థాయికి ఎంపికచేయడం జరిగిందని, నెల్లూరు లోని ప్రతిభా ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థి సయ్యద్ ముస్కాన్, చెన్నూరాయునిపాళెం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి కొండూరు శేషాద్రి, విబిఆర్ స్కూల్ విద్యార్థి వెంకట సాయిరూపేష్, గుండెమడకల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.పవన్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అనంతరం ఈ విద్యార్థులను అందరూ అభినందించారు. జిల్లా ఫిజికల్‌సైన్స్ ఫోరం అధ్యక్షుడు కెవిఆర్ మూర్తి, గైడ్ ఉపాధ్యాయుడు టి.రమణ్‌కుమార్, సమన్వయకర్తలు ఎం.హరిబాబు, అద్దంకి ప్రసాద్, ఎన్.శివ తదితరులు పాల్గొన్నారు.

# దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

**- కల్లూరి చెంగయ్య**

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య రాష్ట్ర ప్రజలకు, దళితప్రజానీకానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య అన్నారు. ఈనెల 14న దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని టూరిజం పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య కలలను సాకారం చేస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలు దళితులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో దళితసంఘాల ప్రతినిధులు అలిశెట్టి అంజయ్య, చిత్తూరుజిల్లా శాఖ అధ్యక్షుడు పూండ్ల సుదర్శనం, మహిళా విభాగం కన్వీనర్ పసుపులేటి కనకదుర్గతో పాటు పెనుమల్లి లత, వాణి, యశోదమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# దగ్ధమైన రథం... భక్తుల శాంతిపథం



మతపరమైన సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత మతాల ప్రజలు భావోద్రేకాలకు లోనవుతుంటారు. ఎలా జరిగిందో పూర్తిగా తెలుసుకోకముందే అల్లర్లకు పాల్పడుతుంటారు. ఇందుకు భిన్నంగా, సంయమనంతో వ్యవహరించి సామరస్య స్ఫూర్తిని చాటుకున్నారు శ్రీవారి భక్తులు.

బోగోలు మండలంలోని కొండబిట్రగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం రథం ఇటీవల ఎవరో చేసిన పనికి మంటల్లో కాలిపోయింది. బ్రహ్మోత్సవాలు మొదలయ్యే సమయంలో రథం కాలిపోవడం భక్తుల మనసులను కలచి వేసింది. రథం దగ్ధం కావడానికి కారణమేంటనే విషయాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కావలి మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, పలువురు హిందూ మతపెద్దలు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు.

సాధారణంగా రథాలకు షెడ్‌లు ఏర్పాటు చేస్తుంటారు. కొండబిట్రగుంట దేవస్థానం రథాన్ని ఆరుబయటే వుంచడం వల్ల ఈ సంఘటనకు ఆస్కారం ఏర్పడింది.

# మద్యం దుకాణాలలో.. నిక్కచ్చిగా నిబంధనలు

**- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ రాధయ్య**

ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో ఎక్సైజ్ నిబంధనలను పక్కాగా అమలయ్యేలా చూడాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ రాధయ్య ఆదేశించారు.

ఈనెల 15 న నెల్లూరు బీవీ నగర్‌లోని తన కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ, సమయ పాలన కచ్చితంగా అమలయ్యేలా చూడాలని, సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్ పనితీరుపై నిఘా ఉంచాలని సూచించారు. క్రమం తప్పకుండా దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రికార్డులు, విక్రయాల తాలూకు ఆర్థిక లావాదేవీల రిజిస్టర్లను పరిశీలించి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బార్లలో తనిఖీలు ముమ్మరం చేయాలని, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్ విక్రయాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. బెల్ట్ విక్రయాల కేసుల్లో నింది తులను బైండోవర్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు, బార్లకు అన్ని బ్రాండ్లను సరఫరా చేయాల్సిందిగా నెల్లూరు, ఓజిలి, ఐఎమ్మెల్ డిపోల మేనేజర్లను ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏసీ మూర్తి, నెల్లూరు, గూడూరు ఈఎస్‌లు శ్రీనివాసాచారి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# బాబును నిద్రలేపిన ట్రంప్

హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు అప్పుడే అమరావతిలో మూడు గ్రామాల రాజధాని ధర్నా ముగించుకుని హైదరాబాద్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు. బాగా అలసిపోయి వుండడంతో హాల్ లోని సోఫాలో జారువాలుగా కూర్చున్నాడు. చంద్రబాబు వచ్చిన అలికిడి కావడంతో లోపల నుండి భువనేశ్వరీదేవి వచ్చింది. చంద్రబాబు చేతుల వైపు చూసి... ఈరోజేమీ కలెక్షన్ రాలేదా అని అడిగింది. కలెక్షన్ ఏంటి? అని చంద్రబాబు ప్రశ్నించాడు. దానికి భువనేశ్వరి... అమరావతి రాజధాని అంటూ రోజూ జోలెపడుతున్నారు కదా, ఈరోజు జోలె పట్టుకోలేదా? అని అడిగింది. నాకేమన్నా అది రెగ్యులర్ డ్యూటీ అనుకున్నావా? అడుక్కోవడం తరతరాలుగా వస్తున్న మా వంశ ఆచారమనుకున్నావా, ఏదో రాజధాని ధర్నా ఖర్చులకోసం ఒకట్రెండు రోజులు జోలెపట్టినంత మాత్రాన నాకు రోజూ అదే పని అనుకుంటున్నావా అని చంద్రబాబు కోప్పడ్డాడు. ఉన్న అధికారం పోయింది, అరకొర సంపాదించిన ఆస్తులు ఆ జగన్ చేయించే దాడులతో ఎక్కడ పోతాయో అర్థం కావడం లేదు. ఇప్పుడు దమ్మిడీ సంపాదన లేకపోయినా ఈ కోపాలకు మాత్రం ఏం తక్కువలేదని రుసరుసలాడుతూ భువనేశ్వరిదేవి వంటింట్లోకిపోయింది. చంద్రబాబు లేచి స్నానం చేసి పప్పుతో రెండు పుల్కాలు తింటుండగా... లోకేష్ గుర్తుకొచ్చాడు. ఇంకా లోకేష్ రాలేదా? అని చంద్రబాబు అడిగాడు. అందుకు అక్కడేవున్న బ్రాహ్మణి... మీ పిఏ, లోకేష్ పిఏల మీద ఐటి దాడులు జరిగాయి కదా, వాటి గురించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టి ఏకిపారేయడానికి పార్టీ ఆఫీసుకు పోయాడు మామయ్యా అని చెప్పింది. లోకేష్ ప్రెస్‌మీట్ అనగానే చంద్రబాబుకు ఎడమకన్ను అదిరింది. వీడు ప్రెస్‌మీట్‌లో ఏం మాట్లాడుతాడో, ఏం కొంప ముంచుతాడో అనుకుంటూ టీవీ ఆన్‌చేసి 'ఆల్ బకరా న్యూస్' ఛానెల్ పెట్టాడు. లోకేష్ ప్రెస్‌మీట్ ప్రత్యక్ష ప్రసారం... "ఈ జగన్మోహన్‌రెడ్డి మా అనుయాయుల మీద కావాలనే ఐటి దాడులు చేయిస్తున్నాడు, ఈయన చేసిన దాడుల వల్ల ఎలుకలను కూడా పట్టుకోలేదు, ఇంక ఏనుగులనేం పట్టుకుంటారు, ప్రభుత్వంలో మేం చేసిన అక్రమాలు, అవినీతిని బయటపెట్టాలంటే ఇక్కడ సిబిఐ కాదు, అమెరికా ఎఫ్‌బిఐ కూడా సరిపోదు"... అని మాట్లాడుతున్నాడు. అది చూస్తున్న చంద్రబాబు... అసలు నాకు చెప్పకుండా వీడిని పార్టీ ఆఫీసుకు ఎందుకు పంపించారని తలపట్టుకున్నాడు. లోకేష్ ప్రెస్‌మీట్ కాగానే ఈ నెల 24న ట్రంప్ భారత పర్యటనకు వస్తున్నట్లు, భారత ప్రభుత్వం భారీ స్వాగత సన్నాహాలు చేస్తున్నట్లు న్యూస్ రీడర్ చదివింది. ఆ వార్తతో చంద్రబాబు మనసు ఇంకొంచెం కకావికలమైంది. ఆయన అలాగే సోఫాలో పడుకుని... అదే నేను సీఎంగా వుంటే నాకు చెప్పకుండా అమెరికా అధ్యక్షులెవరైనా ఇండియాలో కాలుపెడతారా? అప్పట్లో నేను ఆంధ్రా సీఎంగా వున్నప్పుడు బిల్‌క్లింటన్ నా పర్మిషన్‌తోనే ఇండియా వచ్చాడు. అంత ర్జాతీయంగా ఆరోజుల్లో నాకు లభించిన గౌరవ మర్యాదలే వేరు... ఈరోజు ట్రంప్‌కు కూడా నేనంటే లెక్కలేకుండా పోయింది అని మనసులో బాధపడుతూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

ఉదయం 6గంటల సమయం... చంద్రబాబు ఇంటి కాలింగ్‌బెల్ మోగింది. ఎవరూ లేవలేదు... లోకేష్ బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకుంటూ, ఈ అడుక్కునే వాళ్ళకు వేళాపాళా లేదు, పొద్దున్నే తగలబడతారని గొణుక్కుంటూ తలుపు తీశాడు. అక్కడున్న వారితో... పొద్దున్నే మీకేం పనిలేదా, మమ్మల్ని ప్రశాంతంగా నిద్రపోనీయరా, తినడానికి ఒకటైం వున్నట్లే అడుక్కోవడానికి కూడా ఒక టైం అన్నది వుంటుంది... పోండి, మళ్ళీ రాపోండి అని కేకలు వేయసాగాడు... అవతల వ్యక్తి మాత్రం... వాట్‌మెన్, ఐ వాంట్ గ్రేట్ గ్లోబల్ లీడర్ షంద్రబాబు నాయుడు... అని అరుస్తున్నాడు. మళ్ళీ లోకేష్... ఈ అడుక్కునేవాళ్ళు ఈమధ్య ఇంగ్లీష్ కూడా నేర్చుకున్నట్లున్నారు. కలెక్షన్ పెరుగుద్దని మీరు ఇంగ్లీష్‌లో అడుక్కున్నా నా డైలాగ్‌లో మార్పుండదు, మీరు మళ్ళీ రాపోండి, మా అమ్మ తెచ్చి అంత ముద్ద వేస్తుందన్నాడు. వాట్ ముద్ద.. ఐడోంట్ నీడ్ ముద్ద... ఐ వాంట్ ది గ్రేట్ లీడర్ షంద్రబాబునాయుడు... అని అవతల వ్యక్తి అనసాగాడు. ఈ మాటల గందరగోళం చంద్రబాబు చెవిని సోకింది. ఆయన టక్కున నిద్ర లేచాడు. ముఖాన ఒక చెంబుడు నీళ్ళు చల్లుకుని వాకిలి వద్దకు పరుగెత్తాడు. అక్కడ లోకేష్ గొడవపడుతున్న వ్యక్తులను చూశాడు. అంతే... ఆయనకు మూర్ఛవచ్చినంత పనైంది. కారణం.. అక్కడ అడుక్కునే వాళ్ళు అనుకుని లోకేష్ గొడవపడుతున్నది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాలతో. చంద్రబాబు లోకేష్‌ను వారించి... రేయ్, వీళ్ళు ఎవరనుకుంటున్నావ్ ట్రంప్ మామయ్యా, మెలానియా అత్తమ్మ అని పరిచయం చేశాడు. ఇంత పొద్దున్నే వచ్చి కాలింగ్‌బెల్ కొడితే అడుక్కునే వాళ్లను కున్నాను డాడీ అని లోకేష్ నాలుక కర్చుకున్నాడు. ట్రంప్ దంపతులను చంద్రబాబు లోపలకు తీసుకెళ్లాడు. వారిని చంద్రబాబు దంపతులు అతిథి మర్యాదలతో గౌరవించాడు. లోకేష్ వుండి... అమెరికాలో మా హిల్లరీ క్లింటన్ అత్తయ్య ఎలా వుందని అడిగాడు. ఆమెకేం.. బాగానే ఉందని ట్రంప్ చెప్పాడు. వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోనూ మీరే పోటీ చేస్తారా? అంకుల్ అని లోకేష్ అడిగాడు. దానికి ట్రంప్... చేయాలనుకుంటున్నాను. ఈసారి మాత్రం మీరు నాకే సపోర్ట్ చేయాలి అంటూ చంద్రబాబు చేతులు పట్టుకున్నాడు. చంద్రబాబు బదులిస్తూ... ఖచ్చితంగా మా మద్దతు మీకే వుంటుంది... క్రితంసారి అనవసరంగా హిల్లరీ క్లింటన్‌కు సపోర్ట్‌చేశాను. మీరు గెలుస్తారని తెలుసుంటే, మీకే సపోర్ట్ చేసుండేవాడినని అంటూ... అయినా భారత పర్యటనకు ఎప్పుడొచ్చారు, ఇలా మా ఇంటికి సడెన్‌గా ఎందుకొచ్చారు, నాకంతా ఆశ్చర్యంగా వుందని అన్నాడు. అందుకు ట్రంప్... భారత్ పర్యటనకు బయల్దేరేముందు మా మంత్రివర్గ సభ్యులతో సమావేశమయ్యాను, భారత్‌లో చూడవలసినది ఏమిటి? భారత్‌లో కలుసుకోవాల్సిన వ్యక్తులెవరు? అని ప్రశ్నించాను, దానికి మా మంత్రులంతా చెప్పిన సమాధానం ఒక్కటే... మీరు కలుసుకోవాల్సిన గ్రేట్ గ్లోబల్ లీడర్ చంద్రబాబునాయుడు, చూడాల్సిన గొప్ప అద్భుతం ప్రపంచంలోని పాతిక మేటి నగరాలను ఒక చోట మిక్స్ చేసి ఆయన కట్టిన అమరావతి రాజధాని నగరం... ఈ రెండింటిని చూస్తే మీ జన్మధన్యమైనట్లే అని చెప్పారు. అందుకే నేను ఇండియాలో దిగిదిగగానే ప్రధాని మోడీని కూడా కలవకుండా నేరుగా ఇటొచ్చానని చెప్పాడు. తన మీద ట్రంప్ అంతటి అభిమానం చూపించేసరికి చంద్రబాబు తట్టుకోలేకపోయాడు. సార్, నా గొప్పతనాన్ని అమెరికా అర్థం చేసుకుంది, అంతర్జాతీయ సమాజం గౌరవించింది, ఈ ఆంధ్ర ప్రజలే అర్థం చేసుకోలేదు, వెరీ పూర్, వెరీ బ్యాడ్ అని పదేపదే అనసాగాడు. అప్పుడే ముఖాన నీళ్లు పడినట్లుండడంతో అలా కలవరిస్తూనే చంద్రబాబు కళ్ళు తెరిచాడు. ఎదురుగా భువనేశ్వరీదేవి చేతిలో చెంబుతో వుంది... తాను రాత్రి పడుకున్న సోఫాలోనే వున్నాడు. పది నిముషాల తర్వాత గాని అర్థం కాలేదు చంద్రబాబుకు అప్పటివరకు తనకు వచ్చింది కల అని... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటన వార్త చూసిన ప్రభావంతో ఇలాంటి కల వచ్చిందని!


## కళ్యాణ వైభవం...!

సాయి - పావని



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు స్వర్ణ శేషయ్య - ఆశాలతల కుమారుడు సాయి సంకీర్త్ - పావని(ప్రీతి) (ఒంగోలు వాస్తవ్యులు మన్నం వీరయ్య - వెంకటరత్నంల కుమార్తె)ల వివాహం ఈ నెల 13వ తేదీ ఒంగోలులోని బచ్చల బాలయ్య సంజీవమ్మ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

స్వాతి - వెంకట్



నెల్లూరు టెక్కేమిట్ట వాస్తవ్యులు దూది వెంకట రమణయ్య(కొనిక రమణయ్య) - వెంకటేశ్వరకుమారిల కుమార్తె స్వాతి - వెంకట శివగణేష్ (హైదరాబాద్ వాస్తవ్యులు బొమ్ము ఆంజనేయులు - భాగ్యలక్ష్మిల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 15వ తేదీ నెల్లూరు గొలగమూడిరోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# ఆదిశక్తులు.. ఆర్థిక శక్తులుగా ఎదగాలి

### - జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో



జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు నెల్లూరు కస్తూరిదేవి పాఠశాల ఆవరణంలోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ భవనంలో కేంద్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలశాఖ, వసంత లక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈనెల 14న మొదటిరోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకరరెడ్డి పాల్గొని జ్యోతి ప్రకాశనం చేసి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, తద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేయాలన్నారు. టీటీడీ బోర్డు మెంబరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పట్టు దల ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేస్తే విజయం తథ్యమన్నారు. యువతరం నేడు వినూత్న ఆవిష్కరణలు చేస్తుందని వీటికి వీపీఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందన్నారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 15న రెండవరోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణా రాష్ట్రాల జనరల్ మేనేజర్ సుందరం శంకర్, విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జడ్జి శోభాలత, ఎంఎస్ఎంఇ ఇండస్ట్రియల్ అడిషనల్ అడ్వైజర్ చంద్రశేఖర్, సైంటిస్టు భావ్యమంజీర్, సీడాక్ ప్రొడక్ట్ మేనేజర్ జగదీష్ బాబు పాల్గొన్నారు.

ఈనెల 16వతేది చివరి రోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటి జనరల్ మేనేజర్ విజయకుమార్ పాల్గొని మాట్లాడుతూ వ్యాపార రంగంలో మహిళలు రాణిస్తేనే దేశ ప్రగతి, కుటుంబ ఆర్థిక స్థితి మెరుగు పడతాయన్నారు. నిర్వాహకురాలు వసంత లక్ష్మీ మాట్లాడుతూ సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపారాలు చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో జిల్లాలోని మహిళలకు ఉపయోగపడేలా ఎంఎస్ఎంఈ సహకారంతో జాతీయ సదస్సు నిర్వహించామన్నారు.

## ప్లాస్టిక్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నెల్లూరు జిల్లా తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్ట్ సమీపంలో ప్రభుత్వ భూమిని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం (సీపీ ఈటీ) సెంటర్ ఫర్ స్కిల్ అండ్ టెక్నికల్ సపోర్టు కేంద్ర బృందం ఈనెల 18న పరి శీలించింది. కారూరు పంచాయితీ పరిధిలోని 14ఎకరాల భూమిని ప్లాస్టిక్ ట్రైనింగు సెంటర్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా గుర్తించి అధికారులు నివేదిక పంపారు. ఈ క్రమంలో కేంద్ర బృందం స్థల పరిశీలన చేసింది. ఈ బృందంలో డైరెక్టర్ హెడ్ కిరణ్‌కుమార్, ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఆర్ఐ అనిత, వీఆర్వో బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఈడీ లైట్ల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్



ఎల్ఈడీ లైట్ల నిర్వహణ కమిటీ ఛైర్మన్ గా జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబును నియమించారు. జిల్లా కమిటీ కన్వీనర్ గా డీపీవో, కమిటీ సభ్యులుగా జడ్పీ సీఈవో, ట్రాన్స్‌కో ఎస్ఈ, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్‌ను నియమించారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ సంస్థ ఈ ఎల్ఈడీ లైట్ల నిర్వహణ చూస్తోంది. అయితే చాలా గ్రామాల్లో పలు లోపాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్ళడంతో పంచాయితీరాజ్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల సలహా మేరకు ఈ కమిటీలను నియమించారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కమిటీ ఈనెల 23వ తేది ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమావేశం కానుంది.

## 'జనసేన'లోకి యువత



జనసేన పార్టీ ఆశయాలకు ఆకర్షితులైన సుమారు వందమంది యువకులు ఈనెల 16న ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి సమక్షంలో జనసేనలో చేరారు. జిల్లా జనసేన యువజన విభాగం అధ్యక్షుడు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో మల్లేష్ తరఫున వీరంతా స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు. పవన్‌కల్యాణ్ భావాలు, జనసేన ఆశ యాలు, మనుక్రాంత్ నాయకత్వాన్ని అభిమానిస్తూ తాము పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి కిషోర్‌కుమార్, పసుపర్తి సుధీర్, మల్లేష్, ప్రశాంత్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి.. 'వేదం' వారు

బహుభాషల్లో అపారమైన పాండిత్యం సంపాదించి సారస్వత రంగంలో నెల్లూరుసీమ ఖ్యాతిని దశదిశలా చాటిన వేదం వెంకట్రామన్ గారు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, నెల్లూరుసాహితీ రత్నమని పలువురు వక్తలు కొనియాడారు. ఆంగ్ల ఉపాధ్యాయునిగా నెల్లూరులోని విఆర్ కళాశాలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన గురువు వేంకటరామన్ అని ప్రశంసించారు.

ఇటీవల పరమపదించిన వేదం వెంకట్రామన్ సేవలను స్మరించుకుంటూ ఈనెల 15న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని రీడింగ్‌రూమ్‌లో సంతాపసభ జరిగింది. వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ సారస్వతవేత్త మోపూరు వేణుగోపాలయ్య మాట్లాడుతూ వేదం వెంకట్రామన్ ఎంత పాండిత్యం ఉన్నా ఎంతో నిరాడంబరంగా ఉండేవారని, ఆయనో ఋషి అని ప్రస్తుతించారు. ప్రముఖ సాహితీవేత్త డా. ఉడాలి నరసింహశాస్త్రి మాట్లాడుతూ వేదం వారి పాండితీ ప్రతిభ అనన్యసామాన్యమన్నారు. డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్నేహితులంటే ఆయనకెంతో ఇష్టమని, ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో ఎంతో ఆత్మీయంగా స్నేహితులతో కాసేపు గడిపేవారని అంటూ వేదం వారితో తమకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రసిద్ధ చరిత్రకారుడు దివంగత నేలనూతల శ్రీకృష్ణమూర్తి అభిమానిగా వేదంవారు ఎన్నెన్నో స్మారక ఉపన్యాసనిధిని ఎంతో శ్రమకోర్చి ఏర్పాటు చేయడం ఎంతో విశేషమని కొనియాడారు. ప్రసిద్ధ సాహితీవేత్త డా. జి.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ వేంకటరామన్ స్మృత్యంకంగా ప్రతి ఏటా ఏదైనా ఒక కార్యక్రమం జరిగేట్లు ఏర్పాటుచేయడం సముచితంగా ఉంటుందన్నారు. తొలుత వేదం వెంకట్రామన్ చిత్రపటానికి అందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత రంగస్థలనటుడు 'హంస' అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డి, సాహితీవేత్తలు ఊరుబిండి సుబ్రహ్మణ్యం,



అవనిగడ్డ కృష్ణమూర్తి, కొండా వెంకటస్వామి, టి.రమణయ్య, హెచ్ఎస్‌వికె రంగారావు, గూడూరు లక్ష్మి, చలంచర్ల భాస్కరరెడ్డి, పి.సాయినారాయణ, అమరా వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణకుమార్, కిరణ్మయూర్, సుభద్రాదేవితో పాటు వేదం వేంకట్రామన్‌గారి ముగ్గురు కుమారులు పాల్గొన్నారు.

## 'వేదం' వారి సాహితీసేవ అపూర్వం

వేదం వెంకట్రామన్ సాహితీసేవ అపూర్వమని, పలుభాషల్లో పండితులైన ఆయన విశిష్టమైన సాహిత్య అకాడమీ అవార్డును కూడా సాధించారని, నెల్లూరు సాహితీసీమకు ఆయన గర్వకారణమని ఈనెల11న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన వేదం వారి స్మారక సభలో పలువురు వక్తలు ప్రస్తుతించారు. ఇటీవలే దివంగతులైన వేదం వెంకట్రామన్ సంతాపసభలో పలువురు సాహితీవేత్తలు ప్రసంగిస్తూ వేదం వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వేదం వారి సాహితీ సేవలను కొనియాడారు. ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు కాళిదాసు పురుషోత్తం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ బి.నాగశేషు, హెచ్ఎస్‌వికె రంగారావు, గంగిశెట్టి శివకుమార్, ఈతకోట సుబ్బారావు, తోట సులోచన, సుభద్రాదేవి, సతీష్, గిద్దలూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 20వ తేదీన గూడూరులో వైసిపి సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన యోగక్షేమాలు తెలుసుకుంటున్న తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాదరావు కుమారుడు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, పక్కన వాకాటి ప్రభాకర్, ఓరేపల్లి హరికృష్ణ, కాండ్ర నారాయణరెడ్డి, కటికాల సురేష్ తదితరులు

# ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించాలి

**- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వి.సి డాక్టర్ శ్యాంప్రసాద్**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మనం చేసే చికిత్స, వైద్యంపై నమ్మకం కల్పించాలని, ఏ చిన్న జబ్బు చేసినా రోగులు ప్రభుత్వాసుపత్రికి వచ్చేలా మన సేవలుండాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్, నెల్లూరీయుడైన డాక్టర్ శ్యాంప్రసాద్ ఉద్బోధించారు. ఈ నెల 19వ తేదీన ఆయన నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజనని ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి, థియేటర్లు ఆధునికంగా వున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరగాలని, ఓపి పెరిగితే కొత్త వైద్య విభాగాలను ప్రవేశపెట్టడానికి ఆస్కారముంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణరాజు, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాంబశివరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏపిపిలుగా ఐదుమంది

నెల్లూరు జోన్ (నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలు) అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నెల్లూరు నగరానికి చెందిన తిరువళ్లూరు ప్రతిమను ప్రభుత్వం నియమించింది. అలాగే ఎం.సుకన్య, బి.స్వాతిరెడ్డి, వై.శివప్రసాద్, వై.శిరీషాలు కూడా ఏపిపిలుగా ఎంపికయ్యారు. వై.శివప్రసాద్, వై.శిరీ షాలు అన్నచెల్లెళ్లు కాగా వీరిద్దరు కూడా రిటైర్డ్ జడ్జి పరుశురాం బిడ్డలు కావడం ఇంకో విశేషం.

ఈ సందర్భంగా ఏపిపిలుగా నియమితులైన వీరికి జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, సహచర న్యాయవాదులు తమ అభినందనలు తెలియజేశారు.

# జాతీయస్థాయిలోనూ ప్రతిభ చాటాలి

కడపజిల్లాలోని రాజంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ చాటిన నెల్లూరు గాంధీనగర్‌లోని ప్రతిభ పాఠశాలకు చెందిన విద్యార్థిని యస్‌డీ ముస్కాన్‌ను ఈనెల 16న విద్యాశాఖ కార్యాలయంలో డీఇవో జనార్ధనాచార్యులు అభినందించి, జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో కూడా ప్రతిభను చాటి జిల్లా రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేయాలని కోరారు.

ఫిర్యాదులపై..

# నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించను

**- జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్**



బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వారిని ఉపేక్షించనని, కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ పోలీసు అధికారులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది ఖచ్చితంగా విధులు నిర్వహిస్తే బాధితులు ఇక్కడకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఇక్కడకు బాధితులు వస్తున్నారంటే మీస్థాయిలో మీరు పనిచేయడం లేదని అర్థమవుతుందని పోలీస్ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈనెల17న జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ భాస్కర భూషణ్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదులు అందాయి. బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ, ఏఎస్పీ క్రైమ్స్ పి.మనోహర్‌రావులను కోరారు. వారి సమస్యలు విన్న పోలీసు అధికారులు వాటిని సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, రెవెన్యూ, న్యాయ సలహాలు తీసుకోవాలన్నారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తున్న ఘటనలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నెల్లూరు నగర, రూరల్, ఎస్‌బీ డీఎస్పీలు జే.శ్రీనివాసులురెడ్డి, కేవీ రాఘవరెడ్డి, ఎన్.కోటారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ర్యాంకుల పేరుతో ర్యాగింగ్ చేయొద్దు

**- ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ హైమావతి**



ర్యాంకుల మోజుతో విద్యార్థులను చదువుల పేరుతో ర్యాగింగ్ చేయొద్దని ఏపి రాష్ట్ర బాలల హక్కుల ఛైర్‌పర్సన్ హైమావతి కోరారు. 19వ తేదీ నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులను స్వేచ్ఛగా చదవనివ్వాలని, మార్కులు, ర్యాంకుల కోసం వారిపై ఒత్తిడి తేవొద్దని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల మానసిక స్థితిని అంచనావేసి, ఆత్మన్యూనతా భావంతో వున్న పిల్లలను గుర్తించి వారిలో మానసిక ధైర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 6 నుండి 14ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అమలులో వుందని, ప్రతిఒక్కరికీ ఉచితంగా విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంచేందుకు ప్రతి తరగతిలో ఆనంద వేదిక పిరియడ్‌ను చేర్చారని, మధ్యాహ్నం భోజనంలో మెరుగైన మెనూను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దిశ చట్టంపై పిల్లలు, వారి తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'అమ్మఒడి', 'జగనన్న గోరుముద్ద' పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యురాలు పద్మలత, సెట్నల్ సిఇఓ సుస్మిత, డిసిసిఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

# ఏపికి వేడుక

(మొదటి పేజీ తరువాయి)

వీటిని సొంతంగా సమకూర్చుకునే పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలి. కేంద్రం నుండి ఆ సహకారం అందే సమయమే రాష్ట్రానికి ఆసన్నమైందన్న వాతావరణం కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో కేంద్రంలో తన పార్టీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పడేలా ఫలితాలు రావాలని జగన్ కోరుకున్నాడు. అలా వస్తే ఏపికి విభజన హామీలు అమలు చేస్తామని గ్యారంటీ ఇచ్చే ప్రభుత్వానికే మద్దతునివ్వాలన్న ఆలోచనలో ఆయన వుండినాడు. కాని బీజేపీకి పూర్తి మెజార్టీ రావడంతో జగన్ ఆశలు అడియాశలయ్యాయి. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి తన మద్దతు అవసరం లేకున్నా, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జగన్ మాత్రం కేంద్ర ప్రభుత్వంతో వైరం లేకుండా, ఎప్పటికప్పుడు వారి సహకారంతో ముందుకుపోతున్నాడు. అయితే, ఇప్పుడు జాతీయ స్థాయిలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసిపిని తమ కూటమిలో చేర్చుకోవడానికి బీజేపీ అధిష్టానం పావులు కదుపుతోంది. వైసిపిని చేర్చుకోవడం ద్వారా దక్షిణాదిలో కూటమిని బలోపేతం చేయాలన్నది వారి ఆలోచన. కాని, బీజేపీతో కలవడం వల్ల జగన్‌కు రాజకీయంగా వచ్చే ప్రయోజనాలేమీ లేవు. ప్రస్తుతం సిఏఏ, ఎన్ఆర్‌సి బిల్లుల వివాదం నేపథ్యంలో పార్టీకి బలమైన ఓటు బ్యాంకుగా వున్న ముస్లింలు దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు. రాజకీయ ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకుంటే ఎన్డీఏలో కలవడం జగన్‌కు నష్టమే!

కాని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే కలవడమే మేలు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా నినాదాన్ని నిలబెట్టింది జగన్. ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్రం ఎప్పుడో తేల్చిచెప్పింది. అయితే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోయినా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించే అవకాశముంది. దీనికి అటు కేంద్రం, ఇటు జగన్ కూడా అంగీకరించవచ్చు. అలాగే రాష్ట్రానికి ఇచ్చిన విభజన నాటి హామీలను పూర్తిగా అమలు చేయడం, జగన్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన శాసనమండలి, సిఆర్‌డిఏ రద్దు వంటి బిల్లులకు ఆమోదం తెలపడం, ప్రత్యేక దృష్టితో రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్రం ముందుకొస్తే... జగన్ కూడా వెనుకాముందు ఆలోచించకుండా ఎన్డీఏలో చేరే అవకాశముంది.

# జాయింట్ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఢిల్లీలో మళ్లీ చక్రం తిప్పాలని కలలు కన్నాడు. అందు కోసం ఆయా రాష్ట్రాలలో బీజేపీని ఓడించడానికి అక్కడున్న బీజేపీయేతర పార్టీలకు ఆర్థిక వనరులు సమకూర్చాడు. కర్నాటకలో దళ్ (ఎస్)కు ఆయన అప్పట్లో ఆర్థిక సహకారం అందింది. కర్నాటకలో బీజేపీ పూర్తి మెజార్టీకి 10సీట్ల దూరంలో నిలిచిపోవడంతో చంద్రబాబు ఆనందం హద్దులు దాటడం తెలిసిందే! కాంగ్రెస్ మద్దతుతో జెడి(ఎస్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, చంద్రబాబే పూనుకుని కుమారస్వామి ప్రమాణ స్వీకారానికి బీజేపీ వ్యతిరేక పార్టీల అధినేతలను అతిథులుగా పిలిపించడం జరిగింది.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలలోనూ చంద్రబాబు నుండి కాంగ్రెస్‌పార్టీకి పెద్దఎత్తున ఆర్థిక సహకారం అందింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఆ రాష్ట్రాలలో కాంగ్రెస్ గెలుపులో మన పాత్ర కూడా వుందంటూ చంద్రబాబు చెప్పడం ఈ ఆర్థిక కోణమే!

గుజరాత్ నుండి రాజ్యసభకు పోటీ చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్‌ను ఎలాగైనా ఓడించాలని అప్పట్లో అమిత్‌షా పంతం పట్టి పని చేశాడు. అమిత్‌షా దెబ్బకు కాంగ్రెస్‌వాళ్ళు తమ ఎమ్మెల్యేలను క్యాంప్‌లకు తీసుకుపోయారు. వందలకోట్లు ఖర్చుచేసి ఎమ్మెల్యేలను నిలబెట్టుకుని అహ్మద్‌పటేల్ రాజ్యసభ అభ్యర్థిగా గెలిచాడు. అప్పట్లో అహ్మద్‌పటేల్‌కు ఈ డబ్బంతా కూడా చంద్రబాబు సమకూర్చాడనే సమాచారం కేంద్రం వద్ద వున్నట్లు తెలుస్తోంది.

**ఆంధ్రా డబ్బుపై ఆరా...**

చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో 2.50 లక్షల కోట్లు అప్పు చేశాడు. ఇక కేంద్రం నుండి ప్రత్యేక నిధులు వచ్చాయి. ఇన్ని నిధులు ఎక్కడకు తరలిపోయాయన్నదే ప్రశ్న? చంద్రబాబు అమరావతి రాజధానిని కట్టలేదు... చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కాని డబ్బు పాటికి డబ్బు ఖర్చయిపోయింది. దొంగ బిల్లుల ద్వారా డబ్బు మొత్తాన్ని స్వాహా చేశారని, అడ్డదారుల్లో నిధుల మళ్లింపు జరిగిందని కేంద్రం మొదటి నుండి అనుమానిస్తోంది. పోలవరం ప్రాజెక్ట్, అమరావతి రాజధానికి కేంద్రం ఇస్తున్న నిధులను చంద్రబాబు దారి మళ్లిస్తున్నాడని అప్పట్లో బీజేపీ నాయకులే ఆరోపించిన సందర్భాలున్నాయి. ఇలా దారి మళ్లించిన డబ్బునే తన ఎన్నికలకే కాకుండా, ఇతర రాష్ట్రాల్లో తమ వ్యతిరేక శక్తులు గెలవడం కోసం చంద్రబాబు విచ్చలవిడిగా ఖర్చు చేశాడని బీజేపీ నమ్ముతోంది. అందుకే ఆయన అవినీతి, అక్రమాల చిట్టాను వెదకడం మొదలుపెట్టింది. పూర్తిస్థాయిలో ఆధారాలు దొరికితే చంద్రబాబుకు త్రీడీ సినిమానే!

# రాజ్యసభకు బీద?

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు సభ్యులుండగా వాళ్ళిద్దరూ నెల్లూరీయులే కావడం గమనార్హం. కాగా, త్వరలో జిల్లా నుండి వైసిపి పార్టీ ద్వారా మరొకరు కూడా రాజ్యసభలోకి ప్రవేశించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. త్వరలో రాజ్యసభలో పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడనున్నాయి. ఏపి నుండి నలుగురు రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవాల్సి వుంటుంది. ప్రస్తుతం శాసనసభలో వున్న బలం దృష్ట్యా మూడు రాజ్యసభ స్థానాలు వైసిపికే దక్కుతాయి. వీటిలో ఒక పదవిని రాంకీ గ్రూప్ అధినేత అయోధ్య రామిరెడ్డికి ఇచ్చే అవకాశముంది. ఇటీవల శాసనమండలి రద్దుతో మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు మంత్రి పదవులు కోల్పోయారు. మోపిదేవిని ఇప్పుడు రాజ్యసభకు పంపే అవకాశముంది.

ఇక మూడో ఛాన్స్ నెల్లూరుజిల్లాకు చెందిన బీద మస్తాన్‌రావుకు వుండొచ్చు. ఇటీవలే ఆయన తెలుగుదేశాన్ని వీడి వైసిపిలో చేరాడు. విజయసాయిరెడ్డికి అత్యంత సన్నిహితుడు, బి.సి వర్గాల నుండి ఆయనను లోక్‌సభకు పంపొచ్చని సమాచారం. నాలుగో పదవి రేస్‌లో టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు. ఒకవేళ పొత్తు కుదిరితే.. 4వ సీటును బీజేపీకి ఇచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు.

## వరుస సినిమాలతో..

# దూసుకురానున్న నెల్లూరు కుర్రోడు

### - హీరో వంశీకి.. త్వరలో మరో రెండు సినిమాల్లో చాన్స్



***సినిమారంగంలో నెల్లూరు అంటేనే ఓ ప్రత్యేక అధ్యాయం. మహామహులెందరో ఈ రంగంలో ప్రఖ్యాతిగాంచారు. ఇప్పటికే 'లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో అందరిని అలరించిన 'నిన్ను తలచి' చిత్రంతో ప్రేక్షక జనాదరణ పొందిన నెల్లూరు కుర్రోడు వంశీ.. తాజాగా వరుస సినిమాలతో హిట్‌లు కొట్టబోతున్నాడు.***

వంశీ యాకసిరి.. ఇప్పుడు సినీ రంగంలో ఈ పేరు మార్మోగుతోంది. తండ్రి యాకసిరి మధుసూదనరావు.. నెల్లూరు ట్రంకురోడ్డు వద్ద వీడియో విజన్ అనే షాప్‌తో ఇక్కడివారందరికీ సుపరిచితులే. తల్లి పేరు ధనలక్ష్మి. వీరి కుమారుడే వంశీ. తాతగారు నెల్లూరులోని పొదలకూరురోడ్డు వద్ద పద్మావతి సెంటర్‌లో ఉండేవారు. 'కోళ్ళఫారం సుబ్బయ్య'గా ఆయనందరికీ తెలిసినవారే.

వంశీ నెల్లూరులోని స్వామిదాస్ స్కూలు, సివి రామన్ స్కూల్స్‌లో ప్రాధమిక విద్య పూర్తి చేసి, నారాయణ కాలేజీలో ఇంటర్ చదివాడు. విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ చదివి, ఆ తర్వాత గోవాలో ఎంబిఏ పూర్తిచేశాడు. వంశీకి చిన్నతనం నుంచే నటనారంగంపై ఎంతో ఇష్టం. విద్యారంగంలో ఉన్నతంగా రాణిస్తూనే నటనపై ఆసక్తి పెంచుకుని సినిమారంగంలోకి రావడం, 'నిన్ను తలచి' వంటి మంచి ప్రేమకథా చిత్రంతో హీరోగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమై అందరినీ ఆకట్టుకోవడంతో వంశీ దశ తిరిగింది. సినీరంగంలో ఇప్పుడు వంశీకి మరిన్ని అవకాశాలు వస్తున్నాయి. ఇప్పటికే 'వంశీ' హీరోగా రానున్న పలు సినిమాలకు సంబంధించి కథలపై చర్చలు జరుగుతున్నాయి.

వీటిలో ప్రధానంగా 'బాహుబలి' చిత్రానికి రాజమౌళి దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసిన భాస్కర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఒక సినిమా తయారవుతోంది. ఈ సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా లవ్, సస్పెన్స్, థ్రిల్లర్ జోనర్‌గా తీయబోతున్నారు.

ఒక్క తెలుగులోనే కాక మరాఠి, తమిళ భాషల్లో కూడా ఈ సినిమా రెడీ అవుతోంది. త్వరలోనే తెరకెక్కనుంది. ఈ చిత్రానికి 'ట్రైనర్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది కూడా. ఈ సినిమా ఈ ఏడాదే విడుదలవుతుంది.

అదేవిధంగా ధర్మ అనే మరో కొత్త దర్శకుడిని పరిచయం చేస్తూ 'ఎందుకు ఏమిటి ఎలా'.. అనే డిఫరెంట్ కథతో మరో సినిమాకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వంశీ హీరోగా ఉండే ఈ సినిమాకు శిల్ప గాడబోలే, డి.అరుణ నిర్మాతలు. ఈ సినిమా త్వరలోనే తెరమీదికి రాబోతోంది. కెమెరా మంజునాథ్‌నాయక్, సంగీతం జయవర్ధన్ అంకె. ఇవే కాక, రానున్న రెండేళ్ళలో మరో నాలుగు సినిమాలు 'వంశీ' హీరోగా రాబోతున్నాయి.

ఈ సందర్భంగా వంశీ 'లాయర్'తో మాట్లాడుతూ, అశేష తెలుగు ప్రేక్షకుల విశేష ఆదరణతో, అభిమానులందరి ఆదరాభిమానం.. ఆశీస్సులతో తన చిత్రాలు రానున్న కాలంలో విజయవంతం కావాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.

నెల్లూరీయుడైన వంశీ.. సినిమారంగంలో సూపర్‌హిట్‌లు కొట్టాలని, హీరోగా రాణించి.. ఇంకా అనేక సినిమాల్లో నటించి.. మంచి ఇమేజ్ సంపాదించుకుని సినీరంగంలో నెల్లూరు ఖ్యాతిని దశదిశలా రెపరెపలాడించాలని ఆశిద్దాం!..



# మేము కామెడీ పీస్‌లమేనా?

### • జన సైనికులలో మధనం

***కేవలం పదంటే పదేళ్ల రాజకీయ చరిత్రలోనే 'మెగా' అభిమానులు పట్టని జెండా లేదు, జైకొట్టని పార్టీ లేదు... మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించి 'జై చిరంజీవ' అన్నాడు, రైలింజన్ గుర్తుకే ఓట్లంటూ గీపెట్టాడు. ఏడాదిన్నర తిరక్కముందే చిరంజీవి ప్రజారాజ్యాన్ని తీసుకెళ్లి కాంగ్రెస్‌లో కలిపిస్తే మనసు చంపుకుని 'బిగ్‌బాస్' చెప్పినట్లే కాంగ్రెస్‌కు జైకొట్టారు. రాష్ట్ర విభజనతో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ కోట 'పునాది రాళ్ళ'తో సహా పడిపోగా, చిరంజీవి చాలా సైలెంట్‌గా రాజకీయ 'యుద్ధభూమి' నుండి నిష్క్రమించాడు.***

రాష్ట్ర రాజకీయ తెరపై 'అన్నయ్య' పాత్ర ముగిశాక జై 'జనసేన' అంటూ గబ్బర్‌సింగ్ లెవల్లో 'తమ్ముడు' పవనకళ్యాణ్ ఎంట్రీ ఇచ్చాడు. పార్టీ పెట్టిన తొలి ఎన్నికలలోనే చంద్రబాబు, మోడీలపై 'తొలిప్రేమ' చూపించాడు. సీట్లడక్కుండానే మద్దతు తెలపడానికి వచ్చిన పవన్‌కు వాళ్ళు కూడా 'సుస్వాగతం' పలికి వాడేసుకున్నారు. ఆ తర్వాత పవన్ ప్రత్యేకహోదా విషయంలో బీజేపీతో విభేదించి ఆ పార్టీ నాయకులపైనే 'పులి'లాగా 'పంజా' విసిరాడు. బీజేపీతో విబేధించినా గత ఐదేళ్లు చంద్రబాబు సాగించిన అక్రమాలకు మాత్రం 'అజ్ఞాతవాసి'గా కాపు కాశాడు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం నడుచుకుంటూ సీపీఎం, సిపిఐ, బిఎస్పీ వంటి పార్టీలతో కలిసి 'జల్సా' చేద్దామనుకున్నాడు. ఆయన వ్యూహం బెడిసికొట్టి తన పార్టీ తరపున ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలవగా పోటీ చేసిన రెండుచోట్ల కూడా ఈ 'గుడుంబా శంకర్' ఓడిపోవడం జరిగింది.

ఎన్నికల తర్వాత ఈమధ్య చంద్రబాబు డైరక్షనో లేక సొంతంగా తీసుకున్న యాక్షనో ఏమోగాని మళ్ళీ బీజేపీతో కలుస్తూ, తన జనసైనికుల చేత కాషాయం జెండా పట్టించడానికి సిద్ధమయ్యాడు. ఇక్కడే మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పుడు ఎన్డీఏలోకి వైసిపి చేరబోతుందన్న సమాచారం జనసైనికులలో గుబులు రేకెత్తిస్తోంది. పవన్ రాజకీయాలలోకి అడుగుపెట్టినప్పటి నుండి కూడా జగన్ పట్ల విద్వేషం చూపుతున్నాడు. పవన్ వైఖరి చూస్తే చిన్నప్పుడు గోళీలాట వద్ద జగన్‌తో అతనికి పేచీ వచ్చిందేమో, ఇప్పటికీ దానినే మనసులో పెట్టుకున్నాడేమోననిపిస్తుంది. వైసిపి ఎన్డీఏలో చేరితే బీజేపీ వాళ్ళు పవన్‌ను పెద్దగా పట్టించుకోరు. జనసైనికులు కామెడీ పీస్‌లుగా మిగిలిపోతారు. నిన్నగాక మొన్న పవన్ వెళ్లి బీజేపీతో పొత్తు పెట్టుకుని వచ్చాడు. ఇప్పుడు ఎన్డీఏలో వైసిపి చేరితే 'జనసేన' జనసున్నానే అవుతుందని వారి బాధ!

# ఆయన ఓ రాజకీయ విశ్వవిద్యాలయం

### - నేదురుమల్లి జయంతి సభలో వక్తలు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వరప్రసాద్‌రావు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఒక రాజకీయ విశ్వవిద్యాలయం వంటివారని, ఎందరో రాజకీయ నాయకులను ఆ విశ్వవిద్యాలయం తయారు చేసిందని పలువురు నాయకులు కొనియాడారు. 20వ తేదీన కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు, వైసిపి సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేదురుమల్లి పరిపాలన ఆదర్శవంతంగా సాగిందన్నారు. నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వివరించారు. క్రమం తప్పకుండా తమ ఫౌండేషన్ తరఫున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, గత యేడాది కూడా అత్యధిక స్థాయిలో రక్తసేకరణ చేసి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కూడా వారు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com